ఆ పనులపై అనాసక్తి
- గ్రామీణ యువతలో తగ్గిన పని నైపుణ్యం
- వ్యవసాయం, వృత్తి పనులపై స్థానిక యువత అనాసక్తి
- గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నా నిరుపయోగం

6

కుయుక్తుల నుంచి.. స్వేచ్ఛ వైపు..


తాడేపల్లిగూడెంలో నిర్వహించిన ఉమ్మడి సభలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ (ఫైల్)

ప్రజలంతా ఏకపక్షంగా మార్పుకు స్వాగతం పలికారు. దుర్మార్గపు వైసీప పాలనకు తిలోదకాలు ఇచ్చారు. ప్రజాస్వామ్యం పది కాలలపాటు రాణించాలనే నినాదానికి అండగా నిలిచారు. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో జరిగిన బాగోతాల న్నింటినీ ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం గడిచిన ఆరు నెలలుగా తవ్వితీస్తోంది. రాజకీయ కక్ష సాధింపులకు స్వస్తి పలికి ప్రజలు స్వేచ్ఛగా మెలిగేందుకు బాటలు వేసింది. ఈ ఏడాది జరిగిన రాజకీయ పరిణామాలను ఓ సారి మననం చేసుకుందాం.

- ఈ ఏడాదంతా రాజకీయ మిశ్రమమే
- తొలి అర్ధ భాగం వైసీపీ భోగం
- మలి అర్ధ భాగం కూటమిదే విజయం
- అసెంబ్లీలో అడుగిడిన కొత్త ముఖాలు
- రాజకీయంగా అనూహ్య మలుపులు
- వేధింపుల నుంచి సంక్షేమం వైపు అడుగులు

జ్ఞాపకాలు 2024

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఈ ఏడాది ఆరంభం నుంచి ఆరు నెలల వరకు వర్గ బేదం లేకుండా అందరికీ వేధింపులే. అను కూలంగా ఉండకపోతే ఆస్తులు కబ్జా చేస్తామని, రేషన్‌కార్డులు ఎగిరిపోతాయని, పింఛన్లు తొలగి స్తామని, పట్టాదారు పాస్ పుస్తకాల్లో సర్వే నెంబర్లు మాయమవుతాయని, కేసులు పెడతాం, స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిప్పుతామంటూ నానా యాగి. కారణం.. ఈ ఏడాది జరిగిన సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వంలో దాని అనుకూలురంతా చేసిన బీభత్సమది. ప్రజలు ఓపిక పట్టారు. ఎన్నికల సమయం రానే వచ్చింది. అందరూ ఏకతాటి పైకి వచ్చారు. వైసీపీని ఓటమి దిశగా కుమ్మేశారు. ఆ స్థానంలో కూటమిని ఆశీర్వదిస్తూ ప్రభుత్వానికి అధికార పగ్గాలు అప్పగించారు. ఇన్నాళ్ళు పడిన సంకెళ్ళ నుంచి బంధ విముక్తులైనట్టు జనమంతా ఊపిరి పీల్చుకున్నారు. వేధింపులు, కేసులు, ఆక్రమణలు, భూకబ్జాలు ఆనాటి గాయాలతో ఇప్పటికీ బాధ పడుతున్న కుటుంబాలెన్నో. జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక పార్లమెంటు స్థానంలో వైసీపీని తరిమేసి కూటమికే పట్టం కట్టారు. ఈ ఏడాది జరిగిన అతి పెద్ద రాజకీయ పరిణామమిది.

వైసీపీ నేతలు అభివృద్ధిని వదిలేసి నడమంత్రపు సిరితో జిల్లా వ్యాప్తంగా రెచ్చిపోయారు. పేదలను వేధించారు.. భయపెట్టారు. తామే అధికారంలో పది కాలాల పాటు ఉంటామంటూ నమ్మబలికించే ప్రయ త్నం చేశారు. జిల్లాలో 220కు పైగా ప్రేరేపిత రాజకీయ కేసులు నమోదయ్యేలా చేశారు. మరో 40కు పైగా హత్య, హత్యాయత్నం కేసులు నమోదుకు వెను కాడలేదు. పోలీసులను తమ గుప్పెట్లో పెట్టుకుని ప్రత్యర్థుల (ఇప్పటి కూటమి)పై ప్రేరేపించారు. రాజకీయంగా తమకు అడ్డు తగులుతారేమోనన్న భావనతో వివిధ సంస్థల ఎన్నికలను వాయిదా వేస్తూ వచ్చారు. డీసీసీబీ, డీసీఎంఎస్, నామినేటెడ్‌కు నెలవయ్యాయి. ఎన్నికలు దూరమయ్యాయి. ఆ స్థానంలో తాము మెచ్చి, తమకు అనుకూలంగా ఉన్న వారితో నింపేశారు. ఎమ్మెల్యేలు కొందరు ఏకపక్షంగా వ్యవహరించారు. తమకు ఎదురు తిరుగుతున్న వారి ఆస్తులను ధ్వంసం చేశారు. ఏలూరు నగరం లోనూ ఇదే జరిగింది. కొల్లేరులోను ఇష్టానుసారం వ్యవహరించారు. కొన్ని గ్రామ సంఘాల నుంచి నిధులు బొక్కేశారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. ప్రత్తికోళ్ళలంక, శ్రీపర్రు వంటి గ్రామాల్లో తమ నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి ఇప్పుడు మొఖం చాటేస్తున్నారంటూ మాజీ వైసీపీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఇంటి ఎదుట ఇప్పటికీ నిరాహార దీక్షలు సాగడం నాటి రాజకీయ పరి ణామాలకు సజీవ సాక్ష్యం. కైకలూరులోను రకరకాల వివాదాలకు తెరలేపారు. ఆఖరుకి వైసీపీ లోను చిన్నా పెద్ద

- మిగతా 8లో


మల్కాపురం వద్ద 'సిద్ధం' సభలో మాట్లాడుతున్న సీఎం జగన్ (ఫైల్)


ఏలూరులో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలకు కార్యకర్తల సత్కారం (ఫైల్)

చేయి చేయి కలిపి.. విజయాల వైపు

ప్రభుత్వ స్థాపన అనంతరం కూటమి పూర్తిగా నిలదొక్కుకుంది. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యోన్ముకులయ్యారు. ముఖ్యమంత్రిగా ఈ ఆరు నెలల్లోనే రెండుసార్లు ప్రాజెక్టును సందర్శించారు. ఏజెన్సీతోపాటు, అధికారులకు దిశ నిర్దేశం చేశారు. నామినేటెడ్ పదవుల విషయంలో జిల్లాలో ఇప్పటివరకు ఏడుగురికి ఛాన్స్ దక్కింది. కాని వీటి కోసం దరఖాస్తు చేసిన వారి సంఖ్య దాదాపు 60 మందికిపైగానే ఉంది. నిన్నమొన్నటి వరకు వైసీపీ ఆధీనంలో ఉన్న ఏలూరు కార్పొరేషన్‌తోపాటు జిల్లా పరిషత్ కూటమి వైపు మొగ్గింది. ఇక డీసీఎంఎస్, డీసీసీబీ త్వరలోనే ఈ దిశగానే నామినేట్ కాబోతు న్నాయి.

కూటమికి కలిసొచ్చింది..

ఈ ఏడాది వైసీపీ వైపు ప్రజాగ్రహం మళ్ళింది. కూటమికి ప్రజా ఆశీర్వాదం దక్కింది. ఏడు అసెంబ్లీ, పార్లమెంటరీ స్థానాల్లో ఏకపక్షంగా కూటమి అభ్యర్థులను గెలిపించారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎన్నికల వ్యూహం కలిసొచ్చింది. యువనేత నారా లోకేశ్ జిల్లాలో యువగళం పాదయాత్ర కూటమికి మరింత బలాన్ని ఇచ్చింది. నూజివీడు, చింతలపూడి నియోజకవర్గాల్లో కేడర్‌కు కొత్త స్ఫూర్తినిచ్చింది. లోకేశ్ పాదయాత్రలోను వైసీపీ అడుగడుగునా అడ్డు తగిలినా కూటమి తిప్పికొట్టింది. పార్టీ అధినేత చంద్రబాబు పలుమార్లు జిల్లాలో పర్యటించారు. నూజివీడు, ఏలూరు, దెందులూరు, చింతలపూడి నియోజకవర్గాల్లో పర్యటించి కేడర్‌కు ఉత్సాహం నూరిపోశారు. తెలుగుదేశం కేడర్ ముందు వరుసలో నిలవగా కూటమిలో భాగస్వామ్య పక్షాలైన బీజేపీ, జనసేనలు వెన్నంటే నడిచాయి. ఉంగుటూరులో టీడీపీ పక్షాన గన్ని వీరాంజనేయులును కాదని ఆ స్థానాన్ని జనసేనకు కేటాయించి అక్కడ పత్సమట్ల ధర్మరాజు గెలుపొందేలా చేశారు. పోలవరంలో బొరగం శ్రీనివాస్‌ను పక్కనపెట్టి ఆ స్థానాన్ని జనసేనకు ఇచ్చి చిర్రి బాలరాజును గెలిపించారు. కైకలూరులోను బీజేపీ పక్షాన డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను గెలుపొందేలా చేశారు. ఏలూరు జిల్లాలో మూడోసారి గెలిచిన ఎమ్మెల్యేగా చింతమనేని ప్రభాకర్ సీనియర్ స్థానాన్ని ఆక్రమించారు. నూజివీడులో కొలుసు పార్థసారథి టీడీపీలో చేరి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి అందుకున్నారు. జిల్లాలో ఎమ్మెల్యే బడేటి చంటితోపాటు మరో ముగ్గురు అసెంబ్లీకి తొలిసారిగా ఎన్నికయ్యారు. జిల్లాలో ఇప్పటివరకు కొత్త ముఖాలు ఇంత పెద్ద సంఖ్యలో అసెంబ్లీకి వెళ్లడం ఇదే తొలిసారి. ఎంపీ స్థానంలో పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పోటీ చేసినా ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా గన్ని వీరాంజనేయులు పార్టీని పూర్తిగా నిలదొక్కుకునేలా చేయడంలో క్రియాశీలక పాత్ర వహించారు. పార్టీ సీనియర్ నేత పాలి ప్రసాద్ ఆకస్మిక మరణం ఆ పార్టీకి పెద్ద లోటు. బీజేపీ పక్షాన రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పలుమార్లు జిల్లాలో పర్యటించారు. ఏలూరు ఎంపీ స్థానం నుంచి తపన చౌదరి పోటీ చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేసినా అది ఫలించకపోవడంతో చౌదరి డీలా పడకుండా ధైర్యంగా పార్టీనే అంటిపెట్టుకున్నారు. ఇంతకుముందు ఏ ఒక్క స్థానం లేని బీజేపీ కైకలూరును నిలబెట్టుకుని ఇప్పుడు ధీమాగా నిలబడింది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడితో పాటు పాత కార్యవర్గాన్ని మార్చి విక్రమ్ కిశోర్ నేతృత్వాన్న కొత్త కమిటీ ఏర్పాటైంది. జనసేన పక్షాన ఇంతకుముందు కార్యకర్తలే ఉండగా ఇప్పుడు ఏకంగా జిల్లాలో ఉంగుటూరు, పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యేలతోపాటు సరికొత్త బలం వచ్చింది. ఏలూరు సీటు ఆశించిన రెడ్డి అప్పలనాయుడును ఆర్టీసి చైర్మన్ పదవి వరించింది. జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ సైతం జిల్లాలో పర్యటించి కూటమికి ధీటైన నాయకత్వం అందించ డమే కాకుండా ఓటర్లలో స్ఫూర్తి నింపారు.


పుట్టా మహేశ్, ఎంపీ, ఏలూరు


బడేటి చంటి ఎమ్మెల్యే, ఏలూరు


చింతమనేని ప్రభాకర్ ఎమ్మెల్యే,దెందులూరు


రోషన్ కుమార్ ఎమ్మెల్యే, చింతలపూడి


కొలుసు పార్థసారథి ఎమ్మెల్యే, నూజివీడు


కామినేని శ్రీనివాస్ ఎమ్మెల్యే, కైకలూరు


పత్సమట్ల ధర్మరాజు ఎమ్మెల్యే, ఉంగుటూరు


చిర్రి బాలరాజు ఎమ్మెల్యే, పోలవరం


ముసునూరులో యువగళం పాదయాత్ర నిర్వహిస్తున్న లోకేశ్ (ఫైల్)

పెరుగుతున్న చలి తీవ్రత

కనిష్ఠంగా 18 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదు

ఏలూరుసిటీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మబ్బుల వాతావరణం తొలగడంతో మళ్ళీ చలి తీవ్రత బాగా పెరిగింది. జిల్లాలో గత రెండు రోజులుగా చలి తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ చెబుతోంది. సముద్రంపై వీస్తున్న గాలుల కారణంగా చలి తీవ్రత బాగా పెరిగిందని చెబుతున్నారు. రెండు రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు 18 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నమోదయ్యాయి. తెల్లవారుఝామున మంచు ఎక్కువగా కురుస్తోంది.

పింఛన్ల పంపిణీపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఏలూరు సిటీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జనవరి 1వ తేదీ నూతన ఆంగ్ల సంవత్సరం తొలిరోజు కావడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు డిసెంబరు 31వ తేదీ మంగళవారం ఉదయం 6గంటల నుంచి జనవరి నెల పింఛన్ల పంపిణీ చేయనున్నట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఆ రోజున ఏదైనా కారణం చేత తీసుకోని వారికి రెండో తేదీన పంపిణీ చేస్తారన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో ఆమె శనివారం సమీక్షించారు. జిల్లాలో జనవరిలో 2,62,228 మంది ఫించన్‌దారులకు రూ.113.01 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంద న్నారు. గత రెండు నెలల్లో వివిధ కారణాలతో పింఛన్ తీసుకోని వారికి ఈనెలతో కలిపి మొత్తం 3 నెలల పింఛన్ మొత్తాలను పంపిణీ చేస్తారన్నారు. పింఛన్ పంపిణీకి నిర్దేశించిన 5,298 మంది సిబ్బంది ఆ రోజు ఉదయం 6గంటలకు ఈ పింఛన్‌ల పంపిణీ ప్రారంభించాలన్నారు. నవంబరు 2024 నెలలో జీవితభాగస్వామి మరణించిన వారికి 212 మందికి ఈ నెలలో కొత్తగా పింఛన్ మంజూరు చేశారన్నారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, జడ్పీ సీఈవో సుబ్బారావు, ఎల్‌డీఎం నీలాద్రి పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో ఆశాజనకంగా వరి దిగుబడులు

ఏలూరు సిటీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2024-25 ఖరీఫ్ సీజన్‌కు పంటకోత ప్రయోగాలు ముగింపు దశలో ఉన్నట్టు జిల్లా అర్థగణాంక అధికారి శ్రీదేవి పేర్కొన్నారు. దిగుబడి ఆశాజనకంగా ఉన్నట్టు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో సరాసరి దిగుబడి ఎకరానికి 32 నుంచి 35 బస్తాలు వరకు వచ్చినట్టు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 318 యూనిట్లలో నిర్వహించాల్సి ఉండగా దాదాపు అన్నిచోట్ల పంటకోత ప్రయోగాలు పూర్తయ్యాయని తెలిపారు. పంట కోత ప్రయో గాలు పర్యవేక్షణ నిమిత్తం రాష్ట్ర సంచాలకులు, అర్థగణాంక శాఖ కార్యాలయం నుంచి ఉప సంచాల కులు సౌజన్య, ఇతర అధికారులు శనివారం ముదినేపల్లి, మండవల్లి, ఏలూరు, పెదపాడు మండలాల్లో పంట కోత ప్రయోగాలను పర్యవేక్షణ చేశారు.


పైడిచింతపాడులో చెరువులకు గండ్లు పెడుతున్న దృశ్యం

ధ్వంసం కాదు.. గండ్లే!

ఏలూరు రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో కొల్లేరు అభయారణ్యంలో ఇష్టానుసారం తవ్విన చేపల చెరువులను అటవీశాఖ అధికారులు ధ్వంసం చేస్తున్నామని చెబుతున్నా వాస్తవానికి చెరువులకు గండ్లు మాత్రమే పెడుతున్నారు. కొల్లేరు ఆపరేషన్ సమయంలో చెరువులు ధ్వంసం చేసినా తిరిగి గట్లు వేసుకుని సాగు సాగించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో విపరీతంగా అక్రమ చేపల చెరువుల దందా సాగింది. సాధికారిక కమిటీ పరిధిలో ఉన్న కొల్లేరు సరస్సులో పర్యావరణ పరిరక్షణకు ఏ చర్యలు తీసుకోలేదు. అటవీ, మత్స్యశాఖ అధికారులు చోద్యం చూశారు. ఈ క్రమంలో కొల్లేరులో ప్రస్తుత స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని సుప్రీంకోర్టు ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వడంతో అటవీశాఖ అధికారులు రంగంలోకి దిగారు. అయితే అధికారులపై ఒత్తిడి పెరగడంతో చెరువుల ధ్వంసం పేరుతో గండ్లు మాత్రమే కొడుతూ హడావుడి చేస్తున్నారు. ఇటీవల ఏలూరు రూరల్ మండలం లో చాటపర్రు, కొక్కిరాయలంక, పెదయాగనమిల్లి ప్రాంతాల్లో అటవీశాఖ అధికారులు దగ్గరుండి ఎక్స్‌కవేటర్ సాయంతో గండ్లు పెట్టారు. శనివారం మండలంలోని పైడిచింతపాడులో సుమారు 200 ఎకరాలకు గండ్లు పెట్టారు. అధికారులు గండి కొడుతున్న వ్యవహారంపై పలు అనుమానాలకు తావిస్తోంది. చేపల చెరువులు అన్నింటిని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ధ్వంసం చేయాలి. అలాకాకుండా కొన్ని చెరువులకే గండ్లు పెట్టడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మల్లవరంలో..

భీమడోలు : కొల్లేరు అభయారణ్యంలో అక్రమ చేపల చెరువుల ప్రక్షాళన కొనసాగుతుంది. భీమడోలు మండలం చెట్టున్నపాడు శివారు మల్లవరంలో వైసీపీ ప్రభుత్వం హయాంలో అక్రమంగా తవ్వి వందలాది ఎకరాల్లో సాగవుతున్న అక్రమ చేపల చెరువుల గట్లకు అటవీ శాఖ అధికారులు శనివారం గండ్లు పెట్టారు.



క్రిస్మస్ వేడుకల్లో సీఎం చంద్రబాబును అనుకరిస్తున్న ఆంధ్రు లక్ష్మణ్

ఆచంట చంద్రబాబునాయుడు!



నేను ఆయన అభిమానిని

నారా లోకేశ్

ఆచంట చంద్రబాబు నాయుడిని (లక్ష్మణ్) గతంలో పలు సందర్భాల్లో నారా చంద్రబాబునాయుడు కూడా అభినందించారు. ఇప్పుడు ఆయన కుమారుడు, మంత్రి నారా లోకేశ్ అభినందించారు. తాను ఆయన అభిమానిని అంటూ ట్వీట్ చేశారు. సీబీఎన్‌లా కనిపించేందుకు, మాట్లాండేందుకు లక్ష్మణ్ ఎంతో కష్టపడ్డారని లోకేశ్ అన్నారు.

ఆచంట మండలంలో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలు, పార్టీ శ్రేణుల ఇళ్లలో జరిగే ఫంక్షన్లు, క్రిస్మస్, తదితర వేడుకలకు తరచు చంద్రబాబునాయుడు వస్తుంటారు. ఆయనను చూడగానే ఆయా కార్యక్రమాల్లో ఉన్న వారంతా ఒక్కసారిగా ఆశ్చర్యంలో మునిగిపోతారు. ఎందుకంటే ఆయన నారా చంద్రబాబునాయుడు కాదు.. అచ్చు గుద్దినట్లు ఆయనలా కనిపించే ఆచంట చంద్రబాబునాయుడు. ఆచంట శివారు చినపేటకు చెందిన టీడీపీ అభిమాని ఆంధ్రు లక్ష్మణ్ ఆకారంలో చంద్రబాబును పోలి ఉంటారు. దీనితో ఆయన మాదిరి వస్త్రధారణ, నడక, నడతలో చంద్రబాబునే తలపిస్తారు. సీఎం మాదిరి ఇద్దరు గన్‌మెన్‌తో (వారు కూడా డూప్)తో పలు కార్యక్రమాల్లో సందడి చేస్తుంటారు. ఇటీవల క్రిస్మస్ వేడుకల్లో పలుచోట్ల లక్ష్మణ్ చంద్రబాబును అనుకరించి ప్రధాన ఆకర్షణగా నిలిచారు.

- ఆచంట, ఆంధ్రజ్యోతి



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ అనివేటి మండపం

చిన్న తిరుపతిలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామిని కీర్తిస్తూ వేలాది మంది భక్తులు చిన్న తిరుమల క్షేత్రానికి చేరుకున్నారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు, శనిత్రయోదశి కూడా కావడంతో శనివారం దాదాపు 15 వేల మందికి పైగా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తెల్లవారుజామునుంచే భక్తుల రాక ప్రారంభమైంది. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తజనంతో కిటకిటలాడాయి. శ్రీవారి ఉచిత దర్శనానికి 3 గంటల పైబడి సమయం పట్టింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి యాత్రికుల రద్దీ కాస్త తగ్గింది. దర్శనానంతరం భక్తులు శ్రీవారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



గోకుల తిరుమలగిరిపై గోదాదేవికి సమర్పించిన సారె

పారిజాతగిరిపై గోదాదేవికి సారె

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోకులతిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గోదాదేవికి ధనుర్మాస ఉత్సవ కార్యక్రమాల్లో భాగంగా శనివారం సారె సమర్పించారు. ఫల, పుష్పాలు, నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు అమ్మవారికి సమర్పించారు. ముందుగా భక్తులు స్వామివారి ఆలయం చుట్టూ సారెతో ప్రదక్షిణ చేశారు. ఆలయ ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవికి, శ్రీకృష్ణుడికి విశేష అష్టోత్తర పూజలు నిర్వహించి, పండ్లు, ఫలహారాలు సమర్పించారు. అనంతరం సారెలో వినియోగించిన ద్రవ్యములు భక్తులకు ప్రసాదంగా అందచేశారు. ఈ కార్యక్రమానికి భక్తులు విశేష సంఖ్యలో వచ్చారని ఆలయ ఈవో మానికల రాంబాబు తెలిపారు. వికాస తరంగిణి అధ్యక్షురాలు శ్యామలాంబ, సభ్యులు అప్పారావు, శ్రీరామచంద్రమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్యేక దీపాలంకరణలో కాళ్ళకూరు శ్రీవారు

కాళ్ళకూరు వెంకన్నకు ఊంజల్ సేవ



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

కాళ్ళ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు శనివారం సహస్ర దీపాలంకరణ సేవ, అష్టోత్తర శతనామార్చన, ఊంజల్ సేవ కార్యక్రమాలు ఘనంగా జరిపారు. ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ధనుర్మాసం శనివారం కావడంతో తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యల భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో ఎం.అరుణ్‌కుమార్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మన కుర్రోళ్లు.. ప్రత్యేకించి గోదావరి జిల్లాల యువత మంచి పనితనానికి.. తెలివితేటలకు మారుపేరు. అలాంటి యువత నేడు గ్రామీణ ప్రాంతాల్లో పనికి దూరమవుతున్నారు. గ్రామాల్లో వ్యవసాయం, చేతి వృత్తులు, కుటీర పరిశ్రమలు, ఇటుక బట్టీలు, ఇసుక ఎగుమతులు, బరువులు ఎత్తే పనుల్లో మన వాళ్లు కనబడడం లేదు. అంతా ఇతర ప్రాంతాల వారే. గట్టిగా మాట్లాడితే ఇతర రాష్ట్రాల వారు! గతంలోకి తొంగిచూస్తే గోదావరి యువత ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలకు వెళ్లి అక్కడ భూములు, కొండలు, గుట్టలు తక్కువ ధరకు తీసుకుని తమ పనితనంతో అభివృద్ధి చేసి వాటిని ఫలవంతం చేసేవారు. ఇప్పుడు మన ప్రాంతానికి ఇతరులు వలస వస్తున్నారు. మన యువత విద్య ఉద్యోగాల్లో ముందున్నారా అంటే కొంత వరకు అని సమాధానం వస్తుంది. గ్రామీణ ప్రాంత యువకులు ఎందుకు పనులకు వెళ్లడం లేదనే ప్రశ్నకు సమాధానం వినిపించదు. ఉన్న ఊరిలో పనిచేయడానికి బద్ధకమా.. అవసరానికి తగిన సొమ్ము సమకూరితే పనికి వెళ్లరా.. అనే సందేహాలు వస్తున్నాయి. గ్రామీణ యువత చూద్దాం.. చేద్దాం ధోరణిపై ఆదివారం ప్రత్యేక కథనం. - నిడమర్రు, ఆంధ్రజ్యోతి

సండే స్టోరీ



ఆ పనులపై అనాసక్తి

- గ్రామీణ యువతలో తగ్గిన పని నైపుణ్యం
- వ్యవసాయం, వృత్తి పనులపై స్థానిక యువత అనాసక్తి
- ఇక్కడి పనులకు తరలివస్తున్న ఇతర రాష్ట్రాల యువత
- గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నా నిరుపయోగం
- తరలిపోతున్న సొమ్ము
- ఆసక్తి పెంచుకోవాలి

ఉమ్మడి గోదావరి జిల్లాలో ఏ పరిశ్రమకు వెళ్లినా, ఏ వ్యాపార సంస్థలో చూసినా, ఆఖరికి వ్యవసాయంలో కూడా ఇతర ప్రాంతాల యువకులే కాదు.. కాదు.. ఇతర రాష్ట్రాల వారే కనబడుతున్నారు. బీహార్ వాళ్లు ఇటుక బట్టీ నుంచి వరి నాట్లు, ఐస్ ఫ్యాక్టరీలలో పనిచేస్తున్నారు. గోదావరి జిల్లాల్లో వరి నాట్లు వేయడానికి బెంగాలీ కూలీలకు డిమాండ్ ఉండడం విడ్డూరం. ఒడిశా యువకులు అన్ని రెస్టారెంట్లలో హెడ్ కుక్‌లు. వారు బిర్యానీ, ఫ్రైడ్‌రైస్‌తో అదరగొడుతున్నారు. ఇక రాజస్థానీయులు టీ స్టాల్, పానీపూరీ, సెల్ షాపులు, ఎలక్ట్రికల్, శానిటరీ షాపులు ఎక్కువగా నిర్వహిస్తున్నారు. ఉత్తరప్రదేశ్ యువకులు టైల్స్ సీలింగ్ పనిలో నిపుణులుగా చెలామణీ అవుతున్నారు. కేరళ యువతీయువకులు ఇంగ్లీషు టీచర్లుగా నైపుణ్యంతో పని చేస్తున్నారు. కర్ణాటక వాళ్ళు భవన నిర్మాణ కార్మికులుగా చురుకుగా దూసుకుపోతున్నారు. ఇలా ఇతర రాష్ట్రాల ఎంతో మంది ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. ఒక్క క్షణం ఆలోచిస్తే ఈ పని సంపాదన అంతా మన వాళ్లదే కదా అనిపిస్తోంది. మనవాళ్లు పనులు నేర్చుకోక, లేక పనిరాక, పనిచేయాలనే తత్వం లేకపోవడం వల్ల సొమ్మంతా పొరుగు రాష్ట్రాలకు తరలిపోతోంది. ఇంత జరుగుతున్నా మన వాళ్లు మాత్రం పనికి ఆమడ దూరం పరిగెడుతున్నారు. మరి ఎందుకీ మార్పు, ఎందుకీ నిర్లిప్తత? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పని చేయాలంటే నామోషి!

ఒకప్పుడు గ్రామాలలో పనికోసం రైతు కూలీలు వెంపర్లాడేవారు. నేడు పనిచేసే కూలీల కోసం రైతు వెంపర్లాడుతున్నాడు. సరైన పనివారు దొరకక గ్రామాలలో చాలామంది రైతులు పాడి పశువుల పెంపకం, వ్యవసాయం సాగు వదిలివేస్తున్నారు. చేలో పనికి ఉదయం 7 తర్వాత వచ్చే కూలీలు 11 గంటలకు పని నుంచి వెళ్లి పోతున్నారు. రైతు ఎంత బతిమాలాడినా ఒక్క 10 నిమిషాలు కూడా ఉండడం లేదు. గట్టిగా పనిచేయిస్తే మర్నాడు ఆ రైతు కూలీలు చేలోకి రానంటున్నారు. దాంతో పనివారితో పడలేక చాలామంది రైతులు భూములు కౌలుకు ఇచ్చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా డెల్టా ప్రాంతంలో రొయ్య లు, చేపల రైతులు చెరువులపై పనివారు నమ్మకం పనిచేస్తారనే భావనతో పెట్టుబడి లేకుండా చెరువులో 5 - 10 శాతం బెనిఫిట్ షేర్ ఇస్తు న్నారు. అయినా సరే కూలీలు అడ్డం తిరగడంతో చెరువులపై కూడా ఒడిశా, బీహార్ కూలీలు పనికి కుదురుకుంటున్నారు.

సాధారణంగా ఇద్దరు ముగ్గురు పనివారు చేసే వ్యవసాయ పని ప్రస్తుతం నలుగురు, ఐదుగురైతేనే పూర్తి చేయగలుగుతున్నారు. పూర్తిస్థాయిలో పనిచేయలేకపోవడం రైతుకు అదనపు ఆర్థిక భారం పడుతోంది. ఇది గమనించిన రైతులు, వ్యాపారులు తమకు పూర్తి స్థాయి పనిచేసే ఇతర రాష్ట్రాల కుర్రాళ్ల వైపే మొగ్గుచూపుతున్నారు.

జల్సా, సరదాలు..!

గ్రామీణ యువత ఎక్కువ మంది జల్సాలు, సరదాలకు మక్కువ చూపుతున్నారు. కూలి పనికి వెళ్లినా రూ.25 వేల స్మార్ట్ ఫోన్ ఉండాల్సిందే. స్థాయికి మించిన ఖర్చుతో సులభంగా సంపాదించే మార్గాలు వెతుకుతున్నారు. రకరకాల పందేలు, జల్సాలతో పనిపై శ్రద్ధ తగ్గుతోంది. కష్టపడుతున్న పెద్దలు పిల్లలకు నచ్చజెపుతున్నా ఆధునిక సాంకేతిక పోకడలు వారిని కుదురుగా ఉండనివ్వడం లేదు. చేతిలో స్మార్ట్ ఫోన్, మోడరన్ బైక్ ఉంటే చాలనే పరిస్థితిపై కుటుంబ పెద్దలు ఆందోళన చెందుతున్నారు.

గత ఐదేళ్లు పనులు లేవు..!

గత ఐదేళ్లలో మనవాళ్లు పనికి చాలా దూరమయ్యారు. గత ప్రభుత్వం ఇంటి వద్దకే ఉచిత పథకాలు ఎవరి కడుపు నింపకపోయినా అన్ని రంగాల్లో పనులు కొరవడ్డాయి. కొన్ని పేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాల సొమ్ము అందడంతో పనిపై నిర్లిప్తత పెరిగిందనే వాదన కూడా లేకపోలేదు. దీనికి తోడు గతంలో ఉపాధి హామీ పనులు నామమాత్రంగా సాగాయి. పోటో దిగి గంట కూర్చుని వస్తే రోజుకు రూ.250 నుంచి రూ.300 రావడంతో వ్యవసాయ పనులకు వెళ్లడం మానుకున్నారు. ఇది ఇతర రాష్ట్రాల యువతకు కలిసి వచ్చింది.



సంపద తరలిపోతోంది..!

గ్రామీణ యువతలో పని సంస్కృతి కొరవడడంతో వ్యవసాయవ, ఆక్వా, వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో ఇతర రాష్ట్రాల యువకులే కనబడుతున్నారు. శ్రామికుల వేతన ఆదాయమంతా ఇతర రాష్ట్రాలకు తరలిపోతోంది. పొరుగు రాష్ట్రాల యువకులు ఇక్కడి యువకులు చేయాల్సిన పనులు అత్యంత సమర్థవంతంగా, నాణ్యంగా చేయడం వల్ల యజమానులు పొరుగు సేవలపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఈ పొరుగు సేవల సంస్కృతి కొనసాగితే మన యువత పూర్తిగా పనులు కోల్పోయే పరిస్థితులు లేకపోలేదు. స్థాయికి మించిన సరదాలతో రోజులు గడిపేస్తున్న మన కుర్రాళ్ల భవిష్యత్‌లో పని చేద్దామన్నా దొరకని పరిస్థితి నెలకొనవచ్చు. విద్య, వ్యాపారంలో వెనకబడిన, ఆసక్తి లేని వారిని గ్రామీణ ప్రాంత పనుల్లో సమర్థులుగా తీర్చిదిద్దే దిశగా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. యువతకు పనిలో నైపుణ్య శిక్షణ అందుబాటులోకి వచ్చింది. కొంచెం సాంకేతిక పరిజ్ఞానం జోడిస్తే మెరుగైన జీవనం పొందవచ్చు. పని విలువ, కాలం విలువ తెలియజేస్తే ఉన్నచోటే అద్భుత భవిష్యత్ సాక్షాత్కరిస్తుంది.

ఆలోచనాశక్తి పెంపొందించే బాలోత్సవ్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపిమూర్తి



అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శన



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి

భీమవరం టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో ఆలోచనాశక్తిని పెంపొందించేందుకు బాలోత్సవ్ వంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి అన్నారు. చింతలపాటి బాపిరాజు మెమోరియల్ హైస్కూల్‌లో భీమవరం బాలోత్సవం పిల్లల సంబరాలను శనివారం ఆయన ప్రారంభించారు. బాలోత్సవ కమిటీ ప్రెసిడెంట్ ఇందుకూరి ప్రసాదరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నిర్వాహకురాలు స్వరూపారాణి మాట్లాడుతూ పిల్లల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భీమవరం బాలోత్సవం ప్రధాన కార్యదర్శి చెల్లబోయిన పట్టాభిరామయ్య మాట్లాడుతూ సాంస్కృతిక, అకడమిక్ కార్యక్రమానికి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి మాట్లాడారు. డీఎన్నార్ కాలేజ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జి.పాండురంగరాజు, కె.రామకృష్ణంరాజు, పాఠశాల హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, బాలోత్సవం ప్రధాన కార్యదర్శి సీహెచ్.పట్టాభిరామయ్య, గాతల జేమ్స్, జి.ధనుష్, బాలోత్సవం కమిటీ సభ్యులు గురదాసు రఫాయేలు, అల్లూరి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



శక్తి వేషధారిణిగా రాక్షస సంహారం, ఘటోత్కచుడిగా, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులు



మంకొల్లులో పాఠశాల వద్ద మంచినీటి చేతిపంపు

ఆ నీరు అమృతం

చేతిపంపు నీరు ఊరందరి దాహార్తి తీరుస్తోంది. పోతనపల్లి శివారు మంకొల్లు ప్రాథమిక పాఠశాల చేతిపంపు 750 మంది జనాభాకు తాగునీటి వనరు. స్థానికులు నిత్యం చేతి పంపు వద్ద క్యాన్లలో నీరు పట్టుకుంటారు. ఆ నీరు స్థానికులు అమృతం. చేతిపంపు నీరు తాగకపోతే తమకు ముద్ద దిగదని, దీని ముందు మినరల్ వాటర్ దిగదుడుపే అంటారు. అనారోగ్య సమస్యలు కూడా చాలా తక్కువ అని చెబుతున్నారు. బోరు, బావి, చెరువు నీళ్లలో సహజంగా సిద్ధంగా మినరల్స్ ఉంటాయని వైద్యులు అంటున్నారు. నీటిని వేడి చేసి వడకట్టి తాగడం ఉత్తమమని వైద్యులు సూచిస్తున్నారు. - చాట్రాయి

ఉత్సాహంగా 'క్రియ'

- జేఎన్‌టీయూకేలో 11వ రాష్ట్రస్థాయి క్రియ పండుగ
- వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్న విద్యార్థులు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వారంతా భావి భారతపౌరులు. తరగతిగదిలో గడిపే విద్యార్థులంతా ఉత్సాహంగా.. సాంస్కృతిక, క్విజ్, వ్యాసరచన, వేషాలు, నాటిక, నాటక పోటీల్లో ప్రతిభను కనబర్చారు. చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు క్రియ సంస్థ నిర్వహిస్తున్న 11వ రాష్ట్రస్థాయి క్రియ అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు కాకినాడ జేఎన్‌టీయూలో శనివారం ప్రారంభమయ్యాయి.

తొలిరోజు 15 అంశాల్లో..

ఉదయం 7గంటల నుంచి క్రియపిల్లల పండుగ ప్రారంభమైంది. 5 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పలు అంశాల్లో ప్రతిభను ప్రదర్శించారు. తొలిరోజు నాటికలు, శాస్త్రీయ నృత్యాలు, ఏకపాత్రాభినయం, డిబేట్, మ్యాప్, సైన్స్ ఎగ్జిబిషన్, పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్, వ్యాసరచన, స్టోరీ విశ్లేషణ, అంతర్జాలంలో అన్వేషణ, ప్రాజెక్టులు, క్విజ్, విచిత్ర వేషధారణ, పాటలు తదితర 15 అంశాల్లో సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

ప్రతిభను వెలికితీసేందుకు దోహదం

విద్యార్థుల్లో నిక్షిప్తమై ఉన్న కళలను వెలికితీసేలా క్రియ సంస్థ ఒక మహోద్యమంలా ఏటా చిన్నారుల పండుగ నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ అన్నారు. క్రియ సాంస్కృతిక పోటీలు, క్విజ్ డిబేట్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల శక్తిసామర్థ్యాలను, నైపుణ్యాలను పెంచేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. క్రియ సొసైటీ చిత్తశుద్ధితో విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, తద్వారా భవిష్యత్తులో నచ్చిన రంగంలో రాణించేందుకు బంగారు బాటలు వేస్తోందని కితాబిచ్చారు. భావిభారత పౌరుల పిల్లల పండుగకు జేఎన్‌టీయూ వేదిక కావడం ఆనందంగా ఉందని, నేటిపిల్లలే రేపటి శాస్త్రవేత్తలు అని ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులకు క్రియా సంస్థ సభ్యులు 100మంది, 150 మంది జేఎన్‌టీయూకేకి చెందిన బీటెక్, ఎంబీఏ విద్యార్థులు వలంటీర్లుగా సేవలు అందించారు. పడాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలికలకు యుక్తవయసులో వచ్చే మార్పులపై అవగాహన కల్పించారు. సత్యస్కాన్ ఆధ్వర్యంలో ఉచితవైద్య శిబిరం నిర్వహించి విద్యార్థులకు రక్తపరీక్షలు చేశారు. కార్యక్రమంలో క్రియ సొసైటీ అధ్యక్ష, సెక్రటరీలు వి.శ్రీనివాస్, ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు, ఆర్గనైజర్ జగన్నాథరాజు, యు.మాచిరాజు, డాక్టర్ ప్రవీణ్, జగన్నాథరం పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఏపీ, తెలంగాణాకు చెందిన 350 పాఠశాలలకు చెందిన 8,500మంది అత్యంత ఉత్సాహంగా పాల్గొని వివిధ సాంస్కృతిక, క్విజ్, వ్యాసరచన తదితర పోటీల్లో పాల్గొన్నారు.



దీపానంద మహరాజ్ స్వామిజీని సత్కరించిన భక్తులు

ఆధ్యాత్మిక, సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాలి

గణపవరం, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, హిందూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు రామకృష్ణ మఠం కృషి చేస్తుందని స్వామిజీ బోద దీపానంద మహరాజ్ అన్నారు. సరిపల్లె టీటీడీ కల్యాణ మండపంలో 3 రోజులు ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుకునే బాధ్యత ప్రతీ ఒక్కరు స్వీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన్ని భక్తులు సత్కరించారు. నంద్యాల రామలింగరాజు, పవన్‌కుమార్, ఇమ్మంది మాధురి, మణికంఠ మహాలక్ష్మి, బంగారు రాజు, తదితరులు పాల్గొన్నారు.

చిన్న గోపురంలో ధనుర్మాస ప్రత్యేక పూజలు


అలంకరణలో అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం 13వ రోజు శనివారం శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జాము నుంచి అర్చకులు స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, తిరుమంజన సేవలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈసందర్భంగా ఉదయం రేపాక సుధారాణి వీణాగానంతో ప్రభాత సేవ చేశారు. అనంతరం టీటీడీ ప్రబంధ ట్రస్టు అనుమతి పొందిన నూలి మాధురి తిరుప్పావై ప్రవచనం చేస్తూ, అర్చకులు పాశుర విన్నపం వినిపించారు. ఈకార్యక్రమాల్లో ఈవో బీవీవీ సత్య నారాయణ శంకర్, భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా డైలీ మార్కెట్‌లోని వెంకటేశ్వర స్వామికి అర్చకులు గోవర్ధనం కృష్ణ చైతన్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

మునిసిపల్ టీచర్ల సీనియార్టీ జాబితా విడుదల

ఏలూరు అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లాలోని ఏలూరు నగరపాలక సంస్థ, మరో ఏడు పురపాలక సంఘాల పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీగ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లు(లాంగ్వేజెస్)గా పదోన్నతి కల్పించేం దుకు సీనియార్టీ జాబితాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలి పారు. కోర్టు ఆదేశాల ప్రకారం 2017 అక్టోబరు 10వ తేదీనాటికి వున్న ఖాళీల్లో పదోన్నతులు కల్పిస్తామని, సీనియార్టీ జాబితాలను డీఈవో ఏలూరు.ఓఆర్‌జీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు నని వివరించారు. సదరు జాబితాల్లోవున్న ఎస్టీటీలు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిమిత్తం సంబ ంధిత సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్‌తో ఈ నెల 30న ఉదయం 9గంటల్లోగా ఏలూరు డీఈవో కార్యాలయానికి హాజరుకావాలని కోరారు.

పోలవరం కాల్వ గట్టుకు తూట్లు


కాల్వ గట్టుపై అక్రమ తవ్వకాలు

ద్వారకాతిరుమల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలవరం కుడికాలువ గట్ల తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా కాలువ గట్లను ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో పంగిడిగూడెం శివారులో రాత్రివేళ జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను శుక్రవారం రాత్రి కొందరు గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో అక్రమార్కులు రెచ్చిపోయారు. అయినా గ్రామస్థులు ఏ మాత్రం తగ్గకుండా ఎక్స్‌కవేటర్‌ను నిలుపుదల చేశారు. అయితే పోలీసులకు సమాచారం అందిందన్న విషయం తెలుసుకున్న అక్రమార్కులు నెమ్మదిగా జారుకుని శనివారం తెల్లవారుజాము నుంచి మరల తవ్వకాలు ప్రారంభించారు.

వైసీపీ ప్రభుత్వంలోనే అన్ని అనుమతులు

లేహం ఫుడ్ ప్రాడక్ట్ జీఎం అరవింద్ శరీన్



విలేకరులతో మాట్లాడుతున్న లేహం ఫుడ్ ఫ్యాక్టరీ జీఎం అరవింద్ శరీన్

తణుకు రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తేతలి గ్రామంలో ఏర్పాటు చేసిన లేహం ఫుడ్ ప్రొడక్ట్ ఫ్యాక్టరీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అన్ని అనుమతులు వున్నాయని సంస్థ జనరల్ మేనేజర్ అరవింద్ శరీన్ చెప్పారు. శనివారం తణుకులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఫ్యాక్టరీకి సంబంధించిన పలు విషయాలను వివరించారు. ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రక్రియను 2014వ సంవత్సరంలోనే ప్రారంభించామని, అయితే 2019లో అన్ని అనుమతులు పొంది గత వైసీపీ ప్రభుత్వం హయాంలోనే తమ సంస్థ ఉత్పత్తి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ప్రభుత్వం నుంచి తమ సంస్థ కొత్తగా ఎటువంటి అనుమలు పొందలేదన్నారు. తమ ఫ్యాక్టరీ ఒక బహుళ జాతి సంస్థ అని, పూర్తిగా ఎగుమతి ఆధారిత సంస్థ అని దీని వలన 200 మందికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. వీరిలో స్థానికులు 20 మంది వున్నారని చెప్పారు. తమ సంస్థలకు 20 మంది ఏజెంట్ల ద్వారా పశువుల సరఫరా జరుగుతుందన్నారు. వీటిని ఎప్పటికప్పుడు తనిఖీలు చేసేందుకు పశు వైద్యులను కూడా నియమించినట్లు తెలిపారు. తమ సంస్థ ద్వారా పర్యావరణానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. తమది ఇంటిగ్రేటెడ్ ఫ్యాక్టరీ అని కాలుష్యానికి కాని, చుట్టు పక్కల వారికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది డాక్టర్ రమ్య, రేచల్, తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజుకు దీక్షలు

పశువధశాల లేహం ఫుడ్ ప్రొడక్ట్ ఫ్యాక్టరీని మూసేయాలని కోరుతూ గో సంసరక్షణ సమితి, స్థానికులు ఫ్యాక్టరీ ఎదుట చేపట్టిన దీక్షలు శనివారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈశిబిరంలో గో సంరక్షణ సమితి నాయకులు కొండ్రెడ్డి శ్రీనివాసు, పీ సుబ్రహ్మణ్యం, కె బాల కృష్ణ, తేతలి మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, మహిళలు పాల్గొన్నారు.

1 నుంచి ఇంటర్ విద్యార్థులకు 'భోజనం'

పథకం వర్తింపునకు పూర్తయిన కసరత్తు



ఏలూరు అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు కూటమిప్రభుత్వం జనవరి ఒకటో తేదీ నుంచి ప్రారంభించ తలపెట్టిన మధ్యాహ్న భోజన పథకం ఏలూరు జిల్లాలో అమలుపై కసరత్తు ఓ కొలిక్కి వచ్చింది. జిల్లాలో మొత్తం 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా, వీటిలో డే స్కాలర్లుగా 2,192 మంది, హాస్టల్ అటాచ్డ్ విద్యార్థులు 1,668 మంది చదువుతున్నారు. వీరిలో డే స్కాలర్లకు కళాశాలలోనే భోజనవసతి కల్పించడానికి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తికాగా, హాస్టల్ విద్యార్థుల విషయంలో శనివారం స్పష్టతనివ్వాలని ఆయా వసతి గృహాల నిర్వాహకులు, కళా శాల ప్రిన్సిపాళ్లకు ఉన్నతా ధికారులు సూచించారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లోవున్న ప్రభుత్వ హైస్కూళ్ళకు ఒకటి లేదా ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలోనే ఈ జూనియర్ కళాశాలున్నందున సమీపంలోని హైస్కూళ్ళ నుంచి వండిన ఆహార పదార్థాలను రవాణా చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా కళాశాలలను హైస్కూళ్ళ వారీగా ఇప్పటికే మ్యాపింగ్ చేశారు. ఆహార పదార్థాలను రవాణా చేసేందుకయ్యే ఖర్చులను కళాశాల ప్రిన్సిపాల్‌కు ప్రభుత్వం చెల్లిస్తుంది. భోజనంచేసే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బియ్యం, కోడిగుడ్లు, చిక్కీలను జిల్లావిద్యాశాఖ ఆయా ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలకు అందజేస్తుంది. కళాశాల విద్యార్థులకు రాగిజావ పంపిణీపై ఇంతవరకు ప్రభుత్వనిర్ణయం తీసుకోలేదు. ఒక్కో విద్యార్థికి రూ. 8.57 పైసలు చొప్పున వంటచార్జీలుగా ఏజెన్సీలకు జిల్లావిద్యాశాఖ చెల్లిస్తుంది. దీంతోపాటు విద్యార్థుల సంఖ్యను బట్టి వంటకార్మికులకు గౌరవ వేతనాన్ని ఇవ్వనున్నారు.

ఏపీ నిట్‌లో సీట్ల పెంపు లేనట్టేనా..?

- ఫ్యాకల్టీ నియామకంలో జాప్యం..
- ఇన్‌చార్జిలతోనే పాలన



భీమవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో వచ్చే విద్యా సంవత్సరంలోనూ సీట్లు పెరిగే అవకాశం లేదు. ఫ్యాకల్టీ నియామకంలో జాప్యం జరుగుతోంది. ఆ ప్రభావం సీట్లపై పడనుంది. మూడేళ్ల క్రితం ఏపీ నిట్‌లో 750 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించారు. ఫ్యాకల్టీ కొరతతో తర్వాత ఏడాది సీట్ల సంఖ్యను కుదించేశారు. వాస్తవానికి గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిట్ ప్రారంభమైనప్పుడే 480 సీట్లు కేటాయించారు. రాష్ట్ర విభజనలో రాష్ట్ర విద్యార్థులకు అన్యాయం జరగకూడదన్న ఉద్దేశంతో కేంద్రంతో సంప్రదించి సీట్లు పెంచేలా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేసింది. కొత్తగా నిట్ ఏర్పాటైతే 120 సీట్లు మాత్రమే కేటాయిస్తారు. అటువంటిది 2015లో ఏపీ నిట్ ప్రారంభమైనప్పుడు 480 సీట్లకు అడ్మిషన్లు కల్పించారు. మరో 60 సీట్లకు ప్రత్యేకంగా రాష్ట్ర విద్యార్థుల కోసం వరంగల్ నిట్‌లో అడ్మిషన్లు ఇస్తూ వచ్చారు. తదుపరి ఆ సీట్లను కూడా ఏపీ నిట్‌లో విలీనం చేశారు. ఇతర రాష్ట్ర విద్యార్థులకు మరో 50 శాతం సీట్లను కలుపుకుని మొత్తంపైన నిట్‌కు 600 సీట్లు కేటాయించడంలో గత తెలుగుదేశం ప్రభుత్వం విజయవంతమైంది. నిట్‌కు శాశ్వత క్యాంపస్‌ను పూర్తి చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకపడిన విద్యార్థులకు పది శాతం సీట్లు కేటాయించడంతో నిట్‌లో సీట్ల సంఖ్య 750కి చేరింది. ఒక్క ఏడాది మాత్రమే ఆ మేరకు అడ్మిషన్లు కల్పించారు. తర్వాత ఫ్యాకల్టీ కొరత ఉందంటూ కుదించడంతో రెండేళ్ల నుంచి 480 మందికి అవకాశం ఇస్తున్నారు. దీనివల్ల విద్యార్థులు నష్టపోతున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో అయినా సీట్ల సంఖ్య మళ్లీ 750కి చేరుతుందని అంతా ఆశలు పెట్టుకున్నారు. కేంద్ర ప్రభుత్వం 125 మంది ఫ్యాకల్టీ పోస్టులను భర్తీ చేయాలని ఆదేశాలిచ్చింది. నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు. దాదాపు 3,200 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులను గుర్తించి, ఇంటర్వ్యూలు నిర్వహించాలి. అందుకోసం కమిటీలను ఏర్పాటు చేయాలి. అటువంటి ప్రయత్నాలు జరగడం లేదు. అదేవిధంగా 145 బోధనేతర సిబ్బందిని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటివరకు దానికి నోటిఫికేషన్ విడుదల చేయలేదు.

ఇన్‌చార్జి డైరెక్టర్లతో ఇబ్బందులు

ప్రస్తుతం ఏపీ నిట్‌లో ఇన్‌చార్జి డైరెక్టర్ ఉన్నారు. బోర్డు ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్‌ను కూడా నియమించలేదు. రెగ్యులర్ డైరెక్టర్ డాక్టర్ సూర్యప్రకాశరావును తొలగించిన తర్వాత ముగ్గురు ఇన్‌చార్జిలు మారారు. తొలుత నాగపూర్ నిట్ డైరెక్టర్ డాక్టర్ పడేలా ఏడాదిపాటు ఇన్‌చార్జిగా కొనసాగారు. ఆ తర్వాత హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ మూర్తి తొమ్మిది నెలలపాటు నిట్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఆయన హయాంలో ఫ్యాకల్టీ నియామకానికి పోస్టులు మంజూరు చేయించారు. అదనంగా మరో రూ.430 కోట్లు అవసరం అంటూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. అంతలోనే రాయపూర్ నిట్ డైరెక్టర్ ఎన్‌వీ రమణారావును ఇన్‌చార్జిగా నియమించారు. ఇలా మార్పులతోనే కాలం గడుస్తోంది. రెగ్యులర్ డైరెక్టర్ కోసం కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసినా సరే భర్తీ కావడంలేదు. రిజిస్ట్రార్‌తోపాటు, ఇతర అధికారులు ఇన్‌చార్జిలుగానే కొనసాగుతున్నారు. ఈ ప్రభావం నిట్ అభివృద్ధిపై పడుతోంది. సీట్ల సంఖ్య తగ్గిపోయింది. ఇదే పరిస్థితి ఉంటే వచ్చే ఏడాది అడ్మిషన్లలోనూ 480 సీట్లకే ఏపీ నిట్ పరిమితం కానుంది.

30 నుంచి పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు దేహదారుఢ్య పరీక్షలు


పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్, అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30వ తేదీ నుంచి పోలీస్ కానిస్టేబుళ్ళ దేహదారుఢ్య పరీక్షలను ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని సివిల్ (పురుష, మహిళలు), ఏపీఎస్‌పీ (పురుషులు) ప్రిలిమనరీ పరీక్షలలో ఎంపికైన అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలను ఈనెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను ఎస్పీ కిశోర్, అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 4976 మంది అభ్యర్థులకు హాల్ టిక్కెట్లు మంజూరు చేశామన్నారు. వీరిలో 3997 మంది పురుషులు, 979 మహిళలు పాల్గొననున్నారని తెలిపారు. మహిళా అభ్యర్థినులకు ప్రత్యేకంగా జనవరి 3,4 తేదీలలో మహిళా సిబ్బందితో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 204 కానిస్టేబుల్ పోస్టులు ఉన్నాయని ఈ పోటీ పరీక్షలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించే ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా చిత్రీకరణ జరుగుతుందని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఈ పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందస్తుగా రెండు అంబులెన్సులను కూడా ఏర్పాటు చేశా మన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురాకూడదని, సెల్‌ఫోన్లు, వాచీలు ఇతర వస్తువులు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబడవన్నారు. ఈ పరీక్షల కు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్, జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా తీసుకు రావాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురాలేని అభ్యర్థులను పరీక్షలకు అనుమతించబడదని స్పష్టం చేశారు. సమయం కూడా ఇవ్వడం జరగదన్నారు. ఈనెల 30వ తేదీ నుంచి జనవరి 9వ తేదీ వరకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఎస్పీతో పాటు ఎఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఎఆర్ డీఎస్పీ బి చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఆర్ఐ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జలపవారిగూడెంలో ఘర్షణ

కామవరపుకోట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాలంపాడు పంచాయతీ పరిధిలోని జలపవారిగూడెంలో రెండు రోజులుగా ఇరు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ ఘర్షణలో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. తడికలపూడి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొలుకులూరి రాంబాబు, గోరిక రవి, గోరిక సోమయ్య, మరో వర్గానికి చెందిన పల్లా సువర్ణరాజు, పూసమ్మ దంపతులు గాయపడ్డారు. సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘర్షణకు పాల్పడిన వ్యక్తులను ఆదివారం అరెస్టు చేయనున్నట్టు తెలిసింది. ఈ ఘర్షణ నేపథ్యంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ శనివారం ఆ గ్రామం మీదుగా ప్రయాణిస్తున్న తరుణంలో మహిళలు కొంతమంది ఆయన వద్దకు వెళ్ళి ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి కూటమిలోకి కొందరు వ్యక్తులు వచ్చారని, ఆ వ్యక్తుల వలనే ఘర్షణ చోటు చేసుకుందని, వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని వివరించారు.

పండ్ల తోటల సాగుకు నూతన యాజమాన్య పద్ధతులు

అఖిల భారత సమన్వయ పండ్ల పరిశోధనా ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రకాశ్ పాటిల్

రెండేళ్లలో మేలైన డ్రాగన్ ఫ్రూట్ వంగడాలు: వైఎస్ఆర్ హార్టికల్చర్ డైరెక్టర్ మాధవి

కొవ్వూరు ఉద్యాన పరిశోధనా కేంద్రం పరిశీలన


కొవ్వూరు అరటి పరిశోధనా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అఖిల భారత సమన్వయ పండ్ల పరిశోధనా ప్రాజెక్టు కోఆర్డినేటర్ డా. ప్రకాశ్ పాటిల్

కొవ్వూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా పండ్ల తోటలు సాగుచేసే రైతులకు ఎప్పటికప్పుడు నూతన యాజమాన్య పద్ధతులు అందజేస్తున్నట్టు అఖిల భారత సమన్వయ పండ్ల పరిశోధనా ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రకాశ్ పాటిల్ అన్నారు. శనివారం కొవ్వూరు ఉద్యాన పరిశోధనా కేంద్రాన్ని ఆయన పరిశీలించి, ఏడాదిగా జరుగుతున్న పరిశోధన ప్రగతిపై శాస్త్రవేత్తలతో సమీక్షించారు. పండ్లలో కొత్త రకాల ఉత్పత్తి, వేరే ప్రాంతాల్లో విడుదల చేసిన వంగడాలు ఈ ప్రాంతంలో సాగుకు అనుకూలతలు, సాగులో నూతన యాజమాన్య పద్ధతులు, అరటిని ఆశించే తెగుళ్లను ఎదుర్కోవడానికి చేస్తున్న పరిశోధనలను అడిగి తెలుసుకున్నారు. పరిశోధనా ఫలితాలు ఎంతవరకు రైతులకు అందుతున్నాయో తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పండ్ల తోటలు సాగుచేసే రైతులు నష్ట పోకుండా పరిశోధనలు జరుపుతున్నామన్నారు. ఈ పరిశోధనలకు కేంద్రం నుంచి 75 శాతం, రాష్ట్రం నుంచి 25శాతం నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, కడప జిల్లా అనంతరాజుపేట, వెంకట్రామన్నగూడెం, కొవ్వూరు 4 కేంద్రాల్లో అరటి, పనస, సపోట, మామిడి, బొప్పాయి, జామ, నిమ్మ జాతికి చెందిన పంటలపై పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. సాగులో రసాయనాలు తగ్గించి సేంద్రియ వ్యవసాయ పద్ధతుల వైపు రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. దేశంలో వివిధ ప్రాంతాలకు అనుగుణంగా యాజమాన్య పద్ధతులను కనుగొంటున్నామన్నారు. ప్రతి రెండేళ్లకు యూనివర్సిటీ నుంచి నూతన యాజమాన్య పద్ధతులపై ఉద్యాన పంచాంగం (డైరీ), పుస్తకాలను తయారుచేసి రైతులకు అందజేస్తున్నామన్నారు. పరిశోధనల అనంతరం పరీక్ష చేసి వచ్చిన ఫలితాలపై రైతులు సంతృప్తి చెందితే అధిక సంఖ్యలో మేలైన వంగడాలను తయారుచేసి అందజేస్తున్నామన్నారు. వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్శిటీ డైరెక్టర్ ఎం.మాధవి మాట్లాడుతూ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పద్దిపర్రులో రైతు 3 ఎకరాల్లో అవకాడో పంట సాగు చేస్తున్నారన్నారు. డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, రాంభూటన్ పండ్లకు సంబంధించి వెంకట్రామన్నగూడెంలో పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. రైతులు సాగుచేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోటల్లో చీడపీడలతో పాటు, పండ్ల సైజు చిన్నదిగా ఉండడం, నాణ్యత వంటి అంశాలపై మూడేళ్లుగా పరిశోధనలు చేస్తున్నామన్నారు. మరో రెండేళ్లలో మేలైన డ్రాగన్ ఫ్రూట్ వంగడాలను రైతులకు అందజేస్తామన్నారు. ఏ రకాన్ని ఎంపిక చేసుకోవాలి, ఎలా నాటుకోవాలి, యాజమాన్య పద్ధతులు ఏమేమి పాటించాలి, మార్కెట్‌కు ఎలా పంపించాలి. పండ్లు నిల్వ ఉంచుకోవడానికి సంబంధిం చి టెక్నాలజీని అభివృద్ధి చేసి రైతులకు అందిస్తామన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో, వాతావరణ మార్పులు కారణంగా సంభవించే సమస్యలు, ప్రస్తుతం రైతులు సాగులో ఎదుర్కొంటున్న సమస్యలపై 20 కేంద్రాల్లో ఎప్పటికప్పుడు పరిశోధనలు చేసి రైతులకు సూచనలు ఇస్తున్నామన్నారు. భారతదేశం మొత్తంలో భారతీయ సమన్వయ పరిశోధన మండలి పరిధిలో ఉష్ణ మండలం, సమ ఉష్ణ మండలంలో పండ్లతోటలపై పరిశోధనలు చేసి గ్రూపు సమావేశాల్లో శాస్త్రవేత్తలు పరిశోధనా ఫలితాలను ఒకరికొకరు షేర్ చేస్తున్నామన్నారు. కొవ్వూరు ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త పి.లలితా కామేశ్వరి మాట్లాడుతూ ఐదేళ్లుగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని గిరిజన ప్రాంతాల్లో రైతులకు టిష్యూ కల్చర్ అరటి మొక్కలు అందించి ప్రోత్సహిస్తున్నామన్నారు. ఆదివారం మారేడుమిల్లిలో క్షేత్ర సందర్శనకు వెళ్తున్నామన్నారు.

క్రైమ్ కార్నర్

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

భీమవరం క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాటుతున్న వృద్ధుడిని గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భీమవరం జీఆర్‌పీ రైల్వే ఎస్ఐ పీటీవీ రమణ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం ఆకివీడు- భుజబలపట్నం మధ్యలో రైలు పట్టాలను సుమారు 65 ఏళ్ళ వృద్ధుడు దాటుతున్నాడు. ఆ సమయంలో రైలు వస్తుందని పసిగట్టకపోవడంతో రైలు ఢీకొట్టింది. ఆ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి తెల్లని గడ్డం, తెల్ల చొక్కాపై గళ్ళు ఉన్నాయని సంబంధించినవారు ఎవరైనా ఉంటే రైల్వే జీఆర్‌పీ ఎస్ఐ 70939 39777 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

వివాహితకు లైంగిక వేధింపులు

లింగపాలెం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వివాహితపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం శివారు కళ్యాణంపాడు గ్రామానికి చెందిన బొలమాల వంశీకృష్ణ ఓ వివాహితపై ఇంటిలో ఎవ్వరూ లేని సమయంలో లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిపారు. యువతి కేకలు వేయడంతో యువకుడు పారిపోయినట్లు తెలిపారు. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

చీటీల పేరుతో నిండా ముంచాడు

న్యాయం చేయాలంటూ పోలీస్ స్టేషన్ వద్ద బాధితుల ఆందోళన

ఏలూరు క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇరవై ఏళ్ళ క్రితం సాధారణ కిరణా వ్యాపారిగా వచ్చి రకరకాల వ్యాపారాలు చేస్తూ ప్రజలతో స్నేహభావాన్ని పెంచుకుని ఆపై చీటీల వ్యాపారం చేసి అనేక మంది నుంచి వడ్డీకి సొమ్ములను తీసుకుని ఆపై పరారీ అయ్యాడని బాధితులు తమకు న్యాయం చేయాలంటూ ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద శనివారం రాత్రి ఆందోళన చేపట్టారు. ఏలూరు సమీపంలోని కొత్తూరుకు చెందిన జవ్వాజి శ్రీనివాసరావు కొత్తూరు గ్రామానికి 20 ఏళ్ళ క్రితం వచ్చి కిరాణా వ్యాపారిగా వ్యాపారం చేస్తూ మరోవైపు క్యాటరింగ్ నిర్వహించేవాడు. లక్ష రూపాయల నుంచి 30 లక్షల వరకూ చీటీలను నిర్వహించాడు. తన వ్యాపారాల నిమిత్తం అనేక మంది వద్ద ప్రామిసరీ నోట్లు రాసిఇచ్చి లక్షలాది రూపాయలను తీసుకున్నాడు. అంతేకాకుండా చీటీలు పాడుకున్న వారికి సొమ్ములు ఇవ్వకుండా అధిక వడ్డీ ఇస్తానని నమ్మబలికి వారికి ప్రామిసరీ నోట్లు ఇచ్చేవాడు. ఈనెల 23వ తేదీన కిరాణా సరుకులు ఏలూరు వెళ్ళి తీసుకువస్తానని చెప్పి అదృశ్యమయ్యాడు. అతని భార్య త్రి టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుమేరకు అదృశ్యం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అతను తన మోటారు సైకిల్‌ను ఏలూరు కొత్తబస్టాండ్‌లో పెట్టి వెళ్ళినట్లుగా గుర్తించారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉన్నట్లు గుర్తించి అతనిని ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తున్నట్లు బాధితులకు సమాచారం అందడంతో అనేక మంది బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలన్నారు. పలువురు బాధితులు కన్నీళ్ళ పర్యంతం అయ్యారు. పెళ్ళిళ్ళకోసం, చదువులకోసం రూపాయి రూపాయి కూడబెట్టి చీటీలు కట్టుకుంటే నిలువునా ముంచాడంటూ రోదించారు. సుమారు 20 కోట్ల రూపాయల వరకూ ప్రజలకు ఇవ్వాల్సి ఉందని ఆ సొమ్ములను బినామీల పేర్లతో ఆస్తులు కొనుగోలు చేసినట్లుగా బాధితులు ఆరోపిస్తున్నారు. రాత్రికి శ్రీనివాసరావును త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఆతర్వాత పెదపాడు పోలీసులకు అప్పగించారు.


ఇంటిలోని సామగ్రి చిందరవందర చేసిన దొంగలు

కైకరంలో పట్టపగలు చోరీ

10 కాసుల బంగారం.. రూ.60వేల నగదు అపహరణ

ఉంగుటూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కైకరం గ్రామంలో శనివారం మధ్యాహ్న సమయంలో బ్యాంకు ఉద్యోగి ఇంట్లో దొంగతనం జరిగింది. మన్నె సతీష్ కుమార్, అతని భార్య దివ్య భారతి నాలగవ శనివారం కావడంతో బంధువులకు షాపింగ్ చేసేందుకు ఉదయం 11-30 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి తాడేపల్లిగూడెం వెళ్ళారు. తిరిగి సాయంత్రం 3-30 గంటలకు రాగా ఇంటి తలుపులు తీసి ఉన్నాయి. బీరువాలో ఉంచిన రూ.60వేల నగదు, సుమారు 10 కాసుల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. బీరువా లాకర్‌ను తొలగించి ఎత్తుకు వెళ్లారు. ఏలూరు క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. చేబ్రోలు ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ పరిశీలించి కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఇంటర్వ్యూ..

20 ఏళ్లుగా చెరువుల్లో పూడికలు తీయలేదు



చీకటి బాబూరావు, టిఎవెల్ఎస్-2, సాగునీటి సంఘం అధ్యక్షుడు, మల్లాయిగూడెం

- **నీటి సంఘం అధ్యక్షులుగా ఏం చేయాలనుకుంటున్నారు ?**
  జవాబు : పదవులున్నా ప్రయోజనమేముంది. చెరువుల పూడికలు తీయడానికి, కాలువ గట్లు వేయడానికి నిధులు కావాలి.
- **మీ పరిధిలో ఎన్ని చెరువులున్నాయి. సమస్యలు ?**
  జవాబు : తమ్మిలేరు ఆయకట్టు ఎడమ కాలువ-2 సాగునీటి సంఘం పరిధిలో 15 చెరువులు ఉన్నాయి. పూడికలు పెరిగాయి. ఆంధ్ర కాలువ గట్లు దెబ్బతిన్నాయి. మరమ్మతులు చేయాలి.
- **ఎన్నాళ్ళ నుంచి ఈ సమస్య ఉంది ?**
  జవాబు : ఇరవై ఏళ్ళుగా పూడికలు తీయలేదు. గట్లు దెబ్బతిన్నా పట్టించుకోలేదు.
- **నిధులు కోసం ఏ విధమైన ప్రయత్నాలు చేస్తున్నారు ?**
  జవాబు : ఇటీవలే సంఘాలు ఏర్పడ్డాయి. ఎమ్మెల్యే సొంగా రోషన్ సహకారంతో ప్రభుత్వం దృష్టికి తెస్తాం.
- **ఈ ప్రాంతంలో నీటి సంఘాలన్నీ ఏకగ్రీవమయ్యాయి. రైతులు ఏమనుకుంటున్నారు ?**
  జవాబు : గత ప్రభుత్వం చెరువుల అభివృద్ధికి నిధులు ఇవ్వలేదు. రైతులంతా ఒకే మాటపై చెరువుల అభివృద్ధికి కృషి చేయాలని అంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-చింతలపూడి)

సబ్ జైల్ తనిఖీ

చింతలపూడి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి సబ్ జైల్‌ను స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి సీహెచ్.మధుబాబు తనిఖీ జరిపారు. ఖైదీలకు అందుతున్న ఆహారం, వైద్య సదుపాయాలు సమీక్షించారు. ఉచిత న్యాయం కోసం దరఖాస్తు చేయాలని సూచించారు. వంటశాలను, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. సబ్ జైల్ సూపరింటెండెంట్ కృపానందం, న్యాయవాదులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నిక

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా కార్పొరేటర్లు సత్యవతి, ఉచ్చుల సుజాత, జీ.శ్రీనివాసరావు, అనూష, శ్రీనివాసరావులు ఎన్నికయ్యారు. వీరికి మేయర్ నూర్జహాన్ పెదబాబు ఎన్నికల పత్రాలు అందజేశారు. మేయర్‌తో పాటు కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు వీరిని అభినందించారు. కమిషనర్ ఏ.భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 27 కోట్ల పనులకు సోషల్ ఆడిట్

దెందులూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన రూ. 27 కోట్ల పనులకు దెందులూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద సోషల్ ఆడిట్ నిర్వహించారు. సోషల్ ఆడిట్ ఫోరం అధికారి దామోదర్, విజిలెన్స్ అధికారి పురుషోత్తం, ఎంపీడీవో శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో గోపన్నపాలెం, మేదిన రావుపాలెం, కొవ్వలితో పాటు పలు గ్రామాల్లో ఇంకుడు గుంతల పనుల్లో తేడాలను గుర్తించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లకు రికవరీకి సిఫార్సు చేశారు. ఉపాధి ఏపీవో దశరథ రామ్‌జీ, ఫాతిమా, శ్రావణ్‌కుమార్ సిబ్బంది ఉన్నారు.

రెల్లి కులస్థులను గుర్తించాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక వెనుకబాటుకు గురైన రెల్లి కులస్థులను గుర్తించాలని ఎస్సీ రిజర్వేషన్ ఏకసభ్య కమిషనర్ రాజీవ్‌రంజన్‌మిశ్రాకు వినతిపత్రం అందచేసినట్లు ఏపీ రెల్లికుల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీరంశెట్టి పూర్ణచంద్రరావు శనివారం విలేకరులకు తెలిపారు. కాలువలు, మురుగు గుంతలు, చెత్తకుప్పలు, మూత్రశాలలు శుభ్రం చేస్తూ జీవిస్తున్నారన్నారు. రెల్లిగ్రూప్ కోటా రెల్లి కులస్థులే అనుభవించేలా జీవో సవరించాలని కోరారు.

సీపీఐ కార్యాలయం కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కుక్కునూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బుట్టాయిగూడెంలో సీపీఐ పార్టీ కార్యాలయాన్ని కూల్చివేసిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ మండల కార్యదర్శి ఎం.వెంకటాచారి డిమాండ్ చేశారు. శనివారం కుక్కునూరులో విలేకరులతో మాట్లాడారు. వి.శ్యామలా, కొన్నే లక్ష్మయ్య, బాబూరావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిగూడెంలో నవోదయం

ప్రజలకు ఎక్సైజ్ అధికారుల అవగాహన

చింతలపూడి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో శనివారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాగిరెడ్డిగూడెం గ్రామంలో ఎక్సైజ్ అధికారులు, పోలీసులు సారా వల్ల జరిగే అనర్థాలపై ఇంటింటి ప్రచారం జరిపారు. కాగా శనివారం గ్రామంలో దాడులు జరిపి నలుగురు మహిళల నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో రెండు వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్లు భోగేశ్వరరావు, ఫణికుమార్, సీఐలు బి.సత్యనారాయణ, కె.ధన్‌రాజ్, టాస్క్‌ఫోర్స్ సిఐలు ఆర్.సత్యవతి, ఎం.డి.ఆరీఫ్, పోలీస్ సీఐ రవీంద్రనాయక్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నట్టు చింతలపూడి ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు.

విద్యుత్ భారం.. వైసీపీదే పాపం



వినతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

పెదవేగి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ళ జగన్ పాలనలో జరిగిన అవినీతి, పనుల్లో అక్రమాలే నేడు విద్యుత్ ధరల భారానికి కారణమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ధ్వజమెత్తారు. దుగ్గిరాల కార్యాలయంలో శనివారం ఆయన సమస్యలపై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ తీసుకున్న నిర్ణయాల కారణంగా విద్యుత్‌పై రూ.1.29 వేల కోట్లు భారం పడిందన్నారు. జగన్ దిగిపోయినా ఆ శాపం ప్రజలను వెంటాడుతోందన్నారు. ఇంత చేసిన జగన్ ఇప్పుడు సిగ్గులేకుండా విద్యుత్ చార్జీలపై ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విభజిత ఆంధ్రాలో 2014వ సంవత్సరంలో 22.5 మిలియన్ యూనిట్ల లోటుతో ఉన్న డిస్కంను 2019నాటికి మిగులు విద్యుత్ ఉత్పత్తి స్థాయికి చంద్రబాబునాయుడు తీసుకెళ్ళారని, ఆ తరువాత వచ్చిన జగన్ ఐదేళ్ళలో విద్యుత్‌తోపాటు రాష్ట్రాన్ని అన్నివిధాల భ్రష్టు పట్టించాడన్నారు. ఐదేళ్ళ కాలంలో పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచిన జగన్ ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ధర్నాలు చేస్తున్నాడని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టును 2021నాటికి పూర్తిచేయని కారణంగా రూ.4737కోట్ల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుదుత్పత్తిని సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డి ప్రజలపై మోయలేని భారాన్ని వేసి, ఇప్పుడు ధర్నాలు చేయడం దొంగే దొంగా, దొంగా అని అరిచినట్లుగా ఉందని, ఇది జగన్ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు.

గత ప్రభుత్వ ఒప్పందాల వల్లే..

కామవరపుకోట: నాటి వైసీపీ ప్రభుత్వం ప్రజలను వంచించిందని, నేటి కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ స్పష్టం చేశారు. విద్యుత్ చార్జీల భారం తాము మోపిందికాదని, గత ప్రభుత్వం సంస్థతో ఒప్పుకున్న ఒప్పందాల వలన పెంచడం జరిగిందని, తమ ప్రభుత్వ ప్రమేయం లేదని స్పష్టం చేశారు.

గ్రామాల అభివృద్ధే కూటమి ధ్యేయం : రోషన్



జంగారెడ్డిగూడెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కొదమ జ్యోతి అధ్యక్షతన జరిగిన జంగారెడ్డిగూడెం మండల పరిషత్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గం గత ఐదేళ్ళుగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నియోజకవర్గానికి నూతన రోడ్ల నిర్మాణానికి, గుంతలు పూడ్చడానికి రూ.50 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఇప్పటికే పలు రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. మండలంలోని పట్టెన్నపాలెం, పట్టణంలోని బైనేరు, కామవరపుకోట మండలంలోని కళ్ళచెరువు వంతెనల నిమిత్తం ప్రభుత్వం రూ.12 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. గ్రామాల్లోని సమస్యలను మండల స్థాయి అధికారులు ఎప్పటిలోగా పరిష్కరిస్తారో సర్పంచులు, ఎంపీటీసీలకు ఖచ్చితంగా తెలియచేయాలని ఎమ్మెల్యే సూచించారు. పంగిడిగూడెం, అక్కంపేటకు చెందిన వైసీపీ సర్పంచులు కోట వెంకటేశ్వరరావు, పారేపల్లి నాగేంద్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిధులు మంజూరులోను, రోడ్ల నిర్మాణంలోను చురుగ్గా వ్యవహరించడం అభినందనీయమన్నారు. జడ్పీటీసి పోల్నాటి బాబ్జీ, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కామవరపుకోట : అధికారులు, ఉద్యోగులు అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి శాఖ ప్రగతి సాధించాలని చెప్పారు. నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తహసీల్దార్ ఎలీషా, ఎంపీడీవో సరళకుమారి తదితర అధికారులు పాల్గొన్నారు.





రెవెన్యూ సదస్సుల్లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు, తహసీల్దార్ నజీముల్లాషా

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం : పత్సమట్ల

నిడమర్రు/ఉంగుటూరు: డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారమే అజెండాగా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించిందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. శనివారం నిడమర్రులో రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై రైతుల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడుతూ ప్రజలు, రైతులు తమ భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు. తహసీల్దార్ నాగరాజు, సర్పంచ్ పొట్నూరి ఉమా మహేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షులు అంబళ్ల వేణు ప్రసాద్, చెల్లంశెట్టి సూరిబాబు, నిమ్మల దొరబాబు తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని స్థానిక ఎమ్మెల్యే ధర్మరాజు అన్నారు. శనివారం నాడు ఉంగుటూరు మండలం గోపీనాథపట్నం, నాచుగుంట (కొత్తగూడెం)లో మంచి నీటి ట్యాంకులను ఆయన ప్రారంభించారు. సర్పంచ్ యేలేటి సునీత, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎంపీటీసీ గంటా ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెం: భూసమస్యల పరిష్కారానికై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ నజీముల్లాషా అన్నారు. సింగగూడెం, మల్లేశ్వరం గ్రామాలలో రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలపై 15 అర్జీలు రాగా వాటిలో 7 సమస్యలను పరిష్కరించినట్లు తహసీల్దార్ తెలిపారు. డీటీ నాగబాబు, వైస్ సర్పంచ్ బొంతు రాంబాబు, బొంతు శ్రీనివాసరావు, పలువురు రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కామవరపుకోట: శనివారం కళ్ళచెరువులో తహసీల్దార్ గెద్దం ఎలీషా ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ గ్రామసభలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే తమ ప్రభుత్వం పెన్షన్‌ను రూ. నాలుగు వేలకు పెంచిందని, ఉచిత గ్యాస్ సిలిండర్ అమలు చేస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని త్వరలోనే అమలు చేస్తామని, వారికి ఆర్థిక సహాయం అందచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, సర్పంచ్ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి బ్రహ్మయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, వీఆర్వో లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయిస్తా: చిర్రి



పోలవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. శనివారం పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తహసీల్దారు సాయిరాజు, ఎంపీడీవో శ్రీనివాస్, సీఐ బాల సురేష్‌బాబు, జనసేన మండల అధ్యక్షులు గునపర్తి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వారి గుండెల్లో ఏఎన్ఆర్‌కు సుస్థిర స్థానం



మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్

ఏలూరు రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నో సినిమాలతో ప్రేక్షకులను మెప్పించి తెలుగువారి మనస్సుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న అక్కినేని నాగేశ్వరరావు చిత్రపరిశ్రమ ఉన్నంతవరకు ప్రజల హృదయాల్లో సుస్థిరంగా ఉంటారని, శాసనమండలి మాజీ చైర్మన్ ఎం.ఎ షరీఫ్ అన్నారు. శనివారం సర్‌సి.ఆర్ రెడ్డి కళాశాల సాంస్కృతిక విభాగం, ఐక్యూఏసీ, ఘంటసాల స్వరపీఠం సంయుక్త ఆధ్వర్యంలో సీఆర్ రెడ్డి కళాశాల ప్రాంగణంలో శతవసంతాల అక్కినేనికి స్వరాంజలి కార్యక్రమం నిర్వహించారు. షరీఫ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం అక్కి నేని చిత్రాల్లోని పాటలను ఎస్.ఎమ్ సుబానీ, శ్రీవల్లీ సరస్వతి, ఆశ, అర్జున్‌రావు తదితరులు శ్రావ్యంగా ఆలపించారు. కళాశాల కరస్పాం డెంట్ కె.ఎస్ విష్ణుమోహన్, వైస్ ప్రిన్సిపల్ కె.విశ్వేశ్వరరావు, ఘంటసాల స్వరపీఠం అధ్యక్షుడు ఎస్.ఎమ్ సుబానీ, వ్యవస్థాపక కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



మోహన్‌రావును సత్కరిస్తున్న సభ్యులు

వాకర్స్ ఇంటర్నేషనల్ సేవలు భేష్

ఏలూరు రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ అంతర్జాతీయ మహాసభ అంతర్జాతీయ వాకర్స్ అధ్యక్షుడు వల్లూరిపల్లి మురళీ మోహన్‌రావు ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. మాజీ అధ్యక్షులు రామానందం, ఎంవీ సుబ్బారెడ్డి, సీహెచ్. సీతారామయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యక్రమాలను కొనియాడారు. ఏపీ, తెలంగాణ, ఒరిస్సా, కర్నాటక, తమిళనాడు నుంచి సుమారు వెయ్యిమందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ ఏడాది ఉత్తమ సేవలు అందించిన జిల్లా గవర్నర్లు తదితరులకు అవార్డులు అందించారు. తొలుత అభినయ నృత్యభారతి నిర్వాహకులు డి.హేమసుందర్ ఆధ్వర్యంలో కూచిపూడి నాట్యప్రదర్శనలు అలరించాయి.

'అబ్బయ్యచౌదరి నమ్మించి మోసం చేశాడు'

17వ రోజుకు లంక గ్రామస్థుల నిరసన

పెదవేగి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఐదేళ్ళపాటు చేపల చెరువుల్లో ఆదాయాన్ని సొంతం చేసుకున్న దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తమను నమ్మించి, మోసం చేశారని కొల్లేరు లంక గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు రూరల్ మండలం కోమటిలంక, శ్రీపర్రు గ్రామస్థులు అబ్బయ్యచౌదరి చేపల చెరువుల కౌలు సొమ్ము ఇవ్వాలంటూ కొండల రావుపాలెంలో కొఠారు ఇంటి దగ్గర చేపట్టిన నిరసన శనివారం 17వ రోజు కొనసాగింది. లంక గ్రామస్థులు నేతల రవి, సైదు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, రమేష్, ఘంటసాల వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 19 మంది ఎంపిక

బుట్టాయగూడెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడాప్ జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాకు 52 మంది హాజరు కాగా 19 మందికి ఉపాధి లభించినట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.జితేంద్రబాబు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ స్వాతి తెలిపారు. లగ్గరీ ల్యాండ్ లార్డ్, శ్రీరామ్ చిట్స్ కంపెనీల ప్రతినిధులు మేళాలో పాల్గొన్నట్లు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, ఎంపీడీవో

జీలుగుమిల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎంపీపీ కొర్స పోశమ్మ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. అన్ని పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. పథకాలు అర్హులకు అందేలా అధికారులు చూడాలన్నారు. ఎంపీడీవో కె.వెంకటలక్ష్మీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



డిప్లొమా ఇంజినీర్ల సమస్యల పరిష్కారానికి కృషి

అధ్యక్షుడు శాఖమూరి మురళీకృష్ణ

ఏలూరు రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన శాఖమూరి మురళీకృష్ణను సంఘ సభ్యులు శనివారం ఘనంగా సత్కరించారు. ఇప్పటివరకు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఎం.విజయ్‌కుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నిక కావడంతో ఆయన స్థానంలో మురళీకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సంఘ నాయకులు పలువురు ఆయనను ఘనంగా సత్కరించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై ఉద్యమిస్తాం: సీపీఎం

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం దొడ్డిదారిన ట్రూ అప్ చార్జీల భారం వేసిందని సీపీఎం జిల్లా కమిటీ సమావేశం ఆరోపించింది. శనివారం ఏలూరులో సీపీఎం జిల్లా సమావేశం ఆ పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసే కార్యక్రమాన్ని జరపాలని నిర్ణయించామన్నారు. బుట్టాయిగూడెంలో సీపీఐ కార్యాలయం కూల్చివేతను ఖండించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాల్గొన్నారు.

కుక్కునూరు: ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యులపై భారం మోపటం సరి కాదని సీపీఎం మండల కార్యదర్శి బొయ్యన శ్రీను అన్నారు. పెరిగిన విద్యుత్‌చార్జీల పై సీపీఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేసి నిరసన వ్యక్తం చేశారు. వై.సాయికిరణ్, ముత్తయ్య, షేక్ కాశీం, తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురం: పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి, జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్లో ధర్నా నిర్వహించారు.

రైతులకు ఇబ్బందులు రానివ్వద్దు



మాట్లాడుతున్న ఇరిగేషన్ డీఈ నాగార్జున

దెందులూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గోదావరి కాల్వ కింద రైతులకు సాగునీటికి ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేయాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని అవసరమైతే కాంట్రాక్టు రద్దు చేసి సాగునీటి వినియోదారుల సంఘం అధ్యక్షులకు కాంట్రాక్టు బాధ్యత అప్పగిస్తామని గోదావరి కాల్వ ఎగ్జిక్యూటివ్ డివిజన్ ఇంజనీర్ పి. నాగార్జున అన్నారు. శనివారం గోదావరి కాల్వ పరిధిలో పూళ్ల నుంచి గుండుగొలను వరకూ మే నెలలో రూ. 28 లక్షలతో గోదావరి కాల్వలో గుర్రపు డెక్క తొలగింపు పనులు పూర్తి కాకపోవడం, పూర్తి స్థాయిలో గోదావరి కాల్వలో సాగునీటికి గుర్రపు డెక్క అడ్డు వస్తుండటంతో డీఈ నాగార్జున కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుండుగొలను సెక్షన్ కార్యాలయంలో సాగునీటి వినియోగాదారుల సంఘం అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. అనంతరం దెందులూరు, దోసపాడు, కొవ్వలి, మల్కాపురం గోదావరి కాల్వతో పాటు కృష్ణా కాల్వను పరిశీలించారు. టీడీపీ నాయకులు కసుకుర్తి రామకృష్ణ, సాగునీటి వినియోగాదారుల సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

మానవసేవతోనే భగవదనుగ్రహం : మాగంటి



పెదపాడు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మానవ సేవతోనే భగవదనుగ్రహం ఉంటుం దని రాష్ట్ర మాజీ మంత్రి మాగంటి బాబు అన్నారు. తన కుమార్తె పుట్టినరోజును పురస్కరించుకుని హనుమాన్ జంక్షన్ ఆశాజ్యోతి పాఠశాల విద్యార్థులకు దుప్పట్లు, అల్పాహారం పంపిణీ చేశారు. అలాగే పాఠశాల నిర్వహణకు రూ.50వేలు నగదును అందించారు. కార్యక్రమంలో పుట్టగుంట సతీష్‌కుమార్, హనుమాన్‌జంక్షన్ గ్లోబల్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తాడి రంగారావు, నందిగం స్వామి, వేగిరెడ్డి నాని, మేడేపూడి రాజా, రొంపల్లి అచ్యుతరావు, మల్లవల్లి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. పడిపూజా మహోత్సవం

ద్వారకాతిరుమల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్రంలో అయ్యప్ప మాలధారులు పడిపూజ వైభవంగా నిర్వహించారు. ముందుగా ఓ దీక్షాధారుని ఇంటి వద్ద పూజలు చేశారు. శ్రీవారి పాదుకా మండపం వద్ద పూజలు చేసి అయ్యప్ప స్వామిని శరణు ఘోషలు, మేళతాళాలు, డోలు సన్నాయి వాయిద్యాల నడుమ తెచ్చి అలంకరించిన పూజామందిరంలో ఉంచారు. గోవింద స్వాములు సైతం పాల్గొని పూజలు చేశారు.

కుయుక్తుల నుంచి స్వేచ్ఛ వైపు..!

(ఐదో పేజీ తరువాయి)

నేతలంతా ఈ ఏడాది ఆరంభం నుంచి ఎన్నికలు జరిగేంత వరకు వీలు కుదిరినప్పుడల్లా తమ ప్రతాపం ప్రజలపై చూపిస్తూనే వచ్చారు. ముఖ్యమంత్రి హోదాలో జగన్మోహన్ రెడ్డి మూడుసార్లు జిల్లాలో పర్యటించారు. ఎన్నికల్లో చింత లపూడి నుంచి అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలీజాకు మొండి చెయ్యి చూపించారు. పోలవరంలో బాలరాజు ను మార్చి ఆయన భార్యకు ఎమ్మెల్యే సీటు ఇచ్చారు. నూజివీడులో ప్రతాప అప్పారావు తనకు బదులుగా కుమారుడికి ఇవ్వాల్సిందిగా పట్టుపట్టినా నో అన్నారు. ఎంపీ స్థానం నుంచి కోటగిరి శ్రీధర్ తప్పుకోగా ఆయన స్థానంలో కారుమూరి సునీల్‌కు చోటు ఇచ్చినా పరాజయం నుంచి తప్పించుకోలేకపోయారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంటు స్థానంలో వైసీపీ పూర్తిగా తుడుచుపెట్టుకుపోయింది. ఆ తర్వాత ఏలూరు నియోజకవర్గంలో నేతలంతా టీడీపీలో చేరారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పుడు వైసీపీ నేతలు బలహీనమై పార్టీకి కార్యాచరణ కరువై దిక్కుమొక్కు లేకుండా పోయింది. ఆఖరుకి ఒకే ఒక్క ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పార్టీకి, పదవికి కూడా రాజీనామా చేశారు.

అంతా కొత్త నీరే

జిల్లా స్థాయిలో పాత ప్రభుత్వం పోయి కొత్త ప్రభుత్వం వచ్చినట్టే అధికార యంత్రాంగంలోను పెను మార్పులు జరిగాయి. కీలక జిల్లా అధికారులకు స్థాన చలనం కలిగింది. జిల్లా ఎస్పీగా ప్రతాప్ శివ కిశోర్, కలెక్టర్‌గా వెట్రిసెల్వి, జేసీగా ధాత్రిరెడ్డి నియమితులయ్యారు. వీరితోపాటు డజన్ల సంఖ్యలో జిల్లా అధికారులు కొత్తగా బాధ్యతలు స్వీకరించారు. పాత వాసనలు పోయి సరికొత్తగా అడుగులు వేసే దిశగా యంత్రాంగం ఇప్పుడిప్పుడే గాడిన పడుతోంది. వలంటీర్ల వ్యవస్థ పూర్తిగా తొలగిపోగా సచివాలయాల్లో క్రమశిక్షణ నెలకొంది.

'ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి'

ఏలూరు క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణీకులకు మెరుగైన సేవలను అందించాలని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు అధికారులను ఆదేశించారు. ఏలూరు పాతబస్టాండ్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రయాణీకులకు ఎల్లప్పుడు మంచినీళ్ళు అందు బాటులో ఉండాలని, బస్టాండ్ ఆవరణలో ఉన్న మరుగుదొడ్లను మరింత పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఏలూరు డిపో మేనేజర్ బి. వాణీ, అసిస్టెంట్ మేనేజర్ మురళీ తదితరులు పాల్గొన్నారు.



యార్లగడ్డతో అంబికా రాజా

తెలుగు రచయితల మహాసభలు విజయవంతం చేద్దాం

ఏలూరు రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో రెండు రోజుల పాటు జరిగే ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను విజయవంతం చేద్దామని, కవిరత్న అంబికా రాజా పిలుపునిచ్చారు. శనివారం విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. తెలుగుభాష అభివృద్ధికి విశేష కృషిచేసిన పలువురు రచయితలను, భాషాభిమానులను భాషాభివృద్ధి ప్రదాతలను సభద్వారా మననం చేసుకోవడం గొప్పపరిణామం అన్నారు. ఏలూరు నుంచి పలువురు రచయితలు, కవులు పాల్గొన్నారు. ప్రపంచంలో స్థిరపడిన తెలుగు రచయితలు సమావేశాల్లో పాల్గొనటం గర్వకారణమని అంబికా రాజా అన్నారు.

చింతమనేని పాడిగేదె వితరణ

పెదవేగి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో రెండు పాడి గేదెలను కోల్పోయిన బాధిత కుటుంబానికి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అండగా నిలిచారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి శివారు గురుకులపేటకు చెందిన నర్ని వెంకటేశ్వరమ్మ అనే మహిళకు చెందిన రెండు పాడిగేదెలను గుర్తు తెలియని వాహనం ఢీకొని చనిపోవడంతో ఆమె కుటుంబం జీవనాధారాన్ని కోల్పోయింది. తన సమస్యను ఇటీవల మాదేపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభాకర్‌కు తెలపడంతో శనివారంనాడు బాధిత మహిళ పాడిగేదెను బహూకరించారు. వెంకటేశ్వరమ్మ కుటుంబం ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపింది.

స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గం

ఏలూరు రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):ఏలూరు పట్టణ స్వర్ణకార సంఘం ఎన్నికలు శనివారం స్థానిక జ్యూయలర్, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో జరిగాయి. అధ్యక్ష, కార్యదర్శ పదవులకు బొద్దూరి నాగభూషణం, చిట్టూరి త్రినాథ్, ఒక ప్యానెల్‌గా, పాదులూరి తిలక్, తుంపాల సాయి, మరో ప్యానెల్లో పోటీపడ్డారు. సుమారు 600 మందికి పైగా స్వర్ణకారులు ఉన్నారు. 360 ఓట్లు పోల్ అయ్యాయి. 116 ఓట్లు మెజార్టీతో అధ్యక్షుడిగా నాగభూషణం, కార్యదర్శిగా చిట్టూరి త్రినాథ్ ప్యానెల్ ఘన విజయం సాధించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషిచేస్తామన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

కుక్కునూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేద గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని గిరిజన సంఘం నాయకుడు వర్శా పాపారావు కోరారు. శనివారం బెస్తగూడెంలో జరిగిన రెవెన్యూ సదస్సులో అధికారులకు వినతిపత్రం అందజేశారు. వర్శా నాగేశ్వరరావు, పొట్లా లక్ష్మయ్య, చినలక్ష్మయ్య, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

డీఏ బకాయిలు చెల్లించాలి

చింతలపూడి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, డీఏ వంటి బకాయిలు చెల్లించాలని ఎస్టీయు ఏపీ ఉపాధ్యాయ సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు ముప్పిడి శామ్యూల్ విజ్ఞప్తి చేశారు. పీఆర్సీ గడువు పూర్తయినందున ప్రస్తుతం ఐఆర్ 30 శాతం ప్రకటించాలన్నారు. 12వ పీఆర్సీ అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. డీఏ బకాయిలు విడుదల చేయాలన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

బుట్టాయగూడెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారు సత్యన్నారాయణ డిమాండ్ చేశారు. శనివారం బుట్టాయగూడెంలో జరిగిన ఆదివాసీ మహాసభలో పాల్గొని మాట్లాడారు. కొత్త భూసేకరణ చట్టం ప్రకారం ముంపు గ్రామాల్లో సుమారు 50 వేల ఎకరాల వన సంరక్షణ సమితి భూములకు పరిహారం చెల్లించకపోవడం, ముంపు గ్రామాలకు చెందిన భూమిలేని ఎస్సీ, ఎస్టీలకు ఎకరం భూమి అందించే విధంగా ప్రణాళిక రూపొందించకపోవడం నిర్వాసితుల హక్కుల ఉల్లంఘన అవుతుందన్నారు. మహాసభ నాయకులు పాల్గొన్నారు.

తెలుగు యువత నాయకుడు నవీన్ హఠాన్మరణం

పార్థివ దేహానికి ఎమ్మెల్యే రోషన్ నివాళి

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన తెలుగుయువత పట్టణ ఉపాధ్యక్షుడు మల్లిపూడి నవీన్ (27) గుండెపోటుతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. శనివారం చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ నవీన్ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నవీన్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్యేతో పాటు కూటమి నాయకులు పాల్గొని నవీన్ మృతదేహానికి నివాళులర్పించారు.

సండే స్టోరీ



ఆ పనులపై అనాసక్తి

- గ్రామీణ యువతలో తగ్గిన పని నైపుణ్యం
- వ్యవసాయం, వృత్తి పనులపై స్థానిక యువత అనాసక్తి
- ఇక్కడి పనులకు తరలివస్తున్న ఇతర రాష్ట్రాల యువత

ఉమ్మడి గోదావరి జిల్లాలో ఏ పరిశ్రమకు వెళ్లినా, ఏ వ్యాపార సంస్థలో చూసినా, ఆఖరికి వ్యవసాయంలో కూడా ఇతర ప్రాంతాల యువకులే కాదు.. కాదు.. ఇతర రాష్ట్రాల వారే కనబడుతున్నారు. బీహార్ వాళ్లు ఇటుక బట్టీ నుంచి వరి నాట్లు, ఐస్ ఫ్యాక్టరీలలో పనిచేస్తున్నారు. గోదావరి జిల్లాల్లో వరి నాట్లు వేయడానికి బెంగాలీ కూలీలకు డిమాండ్ ఉండడం విడ్డూరం. ఒడిశా యువకులు అన్ని రెస్టారెంట్లలో హెడ్ కుక్‌లు. వారు బిర్యానీ, ఫ్రైడ్‌రైస్‌తో అదరగొడుతున్నారు. ఇక రాజస్థానీయులు టీ స్టాల్, పానీ పూరీ, సెల్ షాపులు, ఎలక్ట్రికల్, శానిటరీ షాపులు ఎక్కువగా నిర్వహిస్తున్నారు. ఉత్తరప్రదేశ్ యువకులు టైల్స్, సీలింగ్ పనిలో నిపుణులుగా చెలామణీ అవుతున్నారు. కేరళ యువతీ యువకులు ఇంగ్లీషు టీచర్లుగా నైపుణ్యంతో పని చేస్తున్నారు. కర్ణాటక వాళ్ళు భవన నిర్మాణ కార్మికులుగా చురుకుగా దూసుకుపోతున్నారు. ఇలా ఇతర రాష్ట్రాల ఎంతోమంది ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. ఒక్కక్షణం ఆలోచిస్తే ఈ పని సంపాదన అంతా మన వాళ్లదే కదా అనిపిస్తోంది. మనవాళ్లు పనులు నేర్చుకోక, లేక పనిరాక, పనిచేయాలనే తత్వం లేకపోవడం వల్ల సొమ్మంతా పొరుగు రాష్ట్రాలకు తరలిపోతోంది. ఇంత జరుగుతున్నా మన వాళ్లు మాత్రం పనికి ఆమడ దూరం పరిగెడుతున్నారు. మరి ఎందుకీ మార్పు, ఎందుకీ నిర్లిప్తత? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పని చేయాలంటే నామోషి!

ఒకప్పుడు గ్రామాలలో పనికోసం రైతు కూలీలు వెంపర్లాడేవారు. నేడు పనిచేసే కూలీల కోసం రైతు వెంపర్లాడుతున్నాడు. సరైన పనివారు దొరకక గ్రామాలలో చాలామంది రైతులు పాడి పశువుల పెంపకం, వ్యవసాయం సాగు వదిలి వేస్తున్నారు. చేలో పనికి ఉదయం 7 తర్వాత వచ్చే కూలీలు 11 గంటలకు పని నుంచి వెళ్లి పోతున్నారు. రైతు ఎంత బతిమాలాడినా ఒక్క 10 నిమిషాలు కూడా ఉండడం లేదు. గట్టిగా పనిచేయిస్తే మర్నాడు ఆ రైతు కూలీలు చేలోకి రానంటున్నారు. దాంతో పనివారితో పడలేక చాలామంది రైతులు భూములు కౌలుకు ఇచ్చేస్తు న్నారు. ఉమ్మడి జిల్లా డెల్టా ప్రాంతంలో రొయ్య లు, చేపల రైతులు చెరువులపై పనివారు నమ్మ కం పనిచేస్తారనే భావనతో పెట్టుబడి లేకుండా చెరువులో 5 - 10 శాతం బెనిఫిట్ షేర్ ఇస్తున్నారు. అయినా సరే కూలీలు అడ్డం తిరగడంతో చెరువులపై కూడా ఒడిశా, బీహార్ కూలీలు పనికి కుదురుకుంటున్నారు.

సాధారణంగా ఇద్దరు ముగ్గురు పనివారు చేసే వ్యవసాయ పని ప్రస్తుతం నలుగురు, ఐదుగురై తేనే పూర్తి చేయగలుగుతున్నారు. పూర్తిస్థాయిలో పనిచేయలేకపోవడం రైతుకు అదనపు ఆర్థిక భారం పడుతోంది. ఇది గమనించిన రైతులు, వ్యాపారులు తమకు పూర్తి స్థాయి పనిచేసే ఇతర రాష్ట్రాల కుర్రాళ్ల వైపే మొగ్గుచూపుతున్నారు.

జల్సా, సరదాలు..!

గ్రామీణ యువత ఎక్కువ మంది జల్సాలు, సరదాలకు మక్కువ చూపుతున్నారు. కూలి పనికి వెళ్లినా రూ.25 వేల స్మార్ట్ ఫోన్ ఉండాల్సిందే. స్థాయికి మించిన ఖర్చుతో సులభంగా సంపాదించే మార్గాలు వెతుకుతున్నారు. రకరకాల పందేలు, జల్సాలతో పనిపై శ్రద్ధ తగ్గుతోంది. కష్టపడుతున్న పెద్దలు పిల్లలకు నచ్చజెపుతున్నా ఆధునిక సాంకేతిక పోకడలు వారిని కుదురుగా ఉండనివ్వడం లేదు. చేతిలో స్మార్ట్ ఫోన్, మోడరన్ బైక్ ఉంటే చాలనే పరిస్థితిపై కుటుంబ పెద్దలు ఆందోళన చెందుతున్నారు.

గత ఐదేళ్లు పనులు లేవు..!

గత ఐదేళ్లలో మనవాళ్లు పనికి చాలా దూరమ య్యారు. గత ప్రభుత్వం ఇంటి వద్దకే ఉచిత పథకాలు ఎవరి కడుపు నింపకపోయినా అన్ని రంగాల్లో పనులు కొరవడ్డాయి. కొన్ని పేద కుటుం బాలకు ప్రభుత్వ పథకాల సొమ్ము అందడంతో పనిపై నిర్లిప్తత పెరిగిందనే వాదన కూడా లేకపోలేదు. దీనికి తోడు గతంలో ఉపాధి హామీ పనులు నామమాత్రంగా సాగాయి. పొటో దిగి గంట కూర్చుని వస్తే రోజుకు రూ.250 నుంచి రూ.300 రావడంతో వ్యవసాయ పనులకు వెళ్లడం మానుకున్నారు. ఇది ఇతర రాష్ట్రాల యువతకు కలిసి వచ్చింది.

సంపద తరలిపోతోంది..!

గ్రామీణ యువతలో పని సంస్కృతి కొరవడడంతో వ్యవసాయవ, ఆక్వా, వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో ఇతర రాష్ట్రాల యువకులే కనబడుతున్నారు. శ్రామికుల వేతన ఆదాయమంతా ఇతర రాష్ట్రాలకు తరలిపోతోంది. పొరుగు రాష్ట్రాల యువకులు ఇక్కడి యువకులు చేయాల్సిన పనులు అత్యంత సమర్థవంతంగా, నాణ్యంగా చేయడం వల్ల యజమానులు పొరుగు సేవలపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఈ పొరుగు సేవల సంస్కృతి కొనసాగితే మన యువత పూర్తిగా పనులు కోల్పోయే పరిస్థితులు లేకపో లేదు. స్థాయికి మించిన సరదాలతో రోజులు గడిపేస్తున్న మన కుర్రాళ్ల భవిష్యత్‌లో పని చేద్దామన్నా దొరకని పరిస్థితి నెలకొనవచ్చు. విద్య, వ్యాపారంలో వెనకబడిన, ఆసక్తి లేని వారిని గ్రామీణ ప్రాంత పనుల్లో సమర్థులుగా తీర్చిదిద్దే దిశగా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. యువతకు పనిలో నైపుణ్య శిక్షణ అందుబాటు లోకి వచ్చింది. కొంచెం సాంకేతిక పరిజ్ఞానం జోడిస్తే మెరుగైన జీవనం పొందవచ్చు. పని విలువ, కాలం విలువ తెలియజేస్తే ఉన్నచోటే అద్భుత భవిష్యత్ సాక్షాత్కరిస్తుంది.

30 నుంచి పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు దేహదారుఢ్య పరీక్షలు

ఏలూరు క్రైం, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): ఈనెల 30వ తేదీ నుంచి పోలీస్ కానిస్టేబుళ్ళ దేహదారుఢ్య పరీక్షలను ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వ హిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డుచే ఉమ్మడి పశ్చిమ గోదా వరి జిల్లా పరిధిలోని సివిల్ (పురుష, మహిళలు), ఏపీఎస్‌పీ (పురుషులు) ప్రిలి మనరీ పరీక్షలలో ఎంపికైన అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలను ఈనెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను ఎస్పీ కిశోర్, అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 4976 మంది అభ్యర్థులకు హాల్ టిక్కెట్లు మంజూరు చేశామన్నారు. వీరిలో 3997 మంది పురుషులు, 979 మహిళలు పాల్గొననున్నారని తెలిపారు. మహిళా అభ్యర్థినులకు ప్రత్యేకంగా జనవరి 3,4 తేదీలలో మహిళా సిబ్బందితో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 204 కానిస్టేబుల్ పోస్టులు ఉన్నాయని ఈ పోటీ పరీక్షలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించే ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా చిత్రీకరణ జరుగుతుందని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఈ పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందస్తుగా రెండు అంబులెన్సులను కూడా ఏర్పాటు చేశామన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురాకూడదని, సెల్‌ఫోన్లు, వాచీలు ఇతర వస్తువులు ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ంచబడవన్నారు. ఈ పరీక్షల కు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్, జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా తీసుకు రావాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకు రాలేని అభ్యర్థులను పరీక్షలకు అనుమతిం చబడదని స్పష్టం చేశారు. సమయం కూడా ఇవ్వడం జరగదన్నారు. ఈనెల 30వ తేదీ నుంచి జనవరి 9వ తేదీ వరకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఎస్పీతో పాటు ఎఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్ శేఖర్, ఎఆర్ డీఎస్పీ బి చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఆర్ఐ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుయుక్తుల నుంచి.. స్వేచ్ఛ వైపు..!

(ఐదో పేజీ తరువాయి)

నేతలంతా ఈ ఏడాది ఆరంభం నుంచి ఎన్నికలు జరిగేంత వరకు వీలు కుదిరినప్పుడల్లా తమ ప్రతాపం ప్రజలపై చూపిస్తూనే వచ్చారు. ముఖ్యమంత్రి హోదాలో జగన్మోహన్ రెడ్డి మూడుసార్లు జిల్లాలో పర్యటించారు. ఎన్నికల్లో చింత లపూడి నుంచి అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలీజాకు మొండి చెయ్యి చూపించారు. పోలవరంలో బాలరాజు ను మార్చి ఆయన భార్యకు ఎమ్మెల్యే సీటు ఇచ్చారు. నూజివీడులో ప్రతాప అప్పారావు తనకు బదులుగా కుమారుడికి ఇవ్వాల్సిందిగా పట్టుపట్టినా నో అన్నారు. ఎంపీ స్థానం నుంచి కోటగిరి శ్రీధర్ తప్పుకోగా ఆయన స్థానంలో కారుమూరి సునీల్‌కు చోటు ఇచ్చినా పరాజయం నుంచి తప్పించుకోలేకపోయారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంటు స్థానంలో వైసీపీ పూర్తిగా తుడుచుపెట్టుకుపోయింది. ఆ తర్వాత ఏలూ రు నియోజకవర్గంలో నేతలంతా టీడీపీలో చేరారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పుడు వైసీపీ నేతలు బలహీనమై పార్టీకి కార్యాచరణ కరువై దిక్కుమొక్కు లేకుండా పోయింది. ఆఖరుకి ఒకే ఒక్క ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పార్టీకి, పదవికి కూడా రాజీనామా చేశారు.

అంతా కొత్త నీరే

జిల్లా స్థాయిలో పాత ప్రభుత్వం పోయి కొత్త ప్రభుత్వం వచ్చినట్టే అధికార యంత్రాంగంలోను పెను మార్పులు జరిగాయి. కీలక జిల్లా అధికారులకు స్థాన చలనం కలిగింది. జిల్లా ఎస్పీగా ప్రతాప్ శివ కిశోర్, కలెక్టర్‌గా వెట్రిసెల్వి, జేసీగా ధాత్రిరెడ్డి నియమితులయ్యారు. వీరితో పాటు డజన్ల సంఖ్యలో జిల్లా అధికారులు కొత్తగా బాధ్యతలు స్వీకరించారు. పాత వాసనలు పోయి సరికొత్తగా అడుగులు వేసే దిశగా యంత్రాంగం ఇప్పుడిప్పుడే గాడిన పడుతోంది. వలంటీర్ల వ్యవస్థ పూర్తిగా తొలగిపోగా సచివాల యాల్లో క్రమశిక్షణ నెలకొంది.

గ్రీన్ విలేజ్‌లో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం : ఎమ్మెల్యే కామినేని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రీన్ విలేజ్‌లో ప్రజలకు అన్నిరకాల సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు ఏలూరురోడ్డులోని గ్రీన్‌విలేజ్‌లో గృహ నిర్మాణాల లబ్ధిదారులకు శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. లబ్ధిదారులు కాలనీలో సమస్యలపై గళమెత్తారు. ఎమ్మెల్యే కామినేని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి ఫోన్‌లో లబ్ధిదారుల సమస్యలను వివరించి వచ్చే నెలలో కాలనీని సందర్శించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఎనిమిది మంది సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నామని ఈ కమిటీ సభ్యులంతా ప్రతీ బుధవారం గ్రీన్‌విలేజ్ లోనే అందుబాటులో ఉంటారన్నారు. కాంట్రాక్టర్‌కు నగదు చెల్లించిన 35 మంది లబ్దిదారులకు నెలరోజుల్లో ఇంటి నిర్మాణాలు చేసి అప్పగించాలన్నారు. గృహ నిర్మాణశాఖ పీడీ సత్యనారాయణ, ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ నవరత్నకుమారి, డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, మండల టీడీపీ అధ్యక్షుడు త్రినాథరాజు, కూటమి నేతలు, ఇన్‌చార్జి తహసీల్దార్ ఇబ్రహీం, ఎంపీడీవో ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ డీవైఈవో వితరణ

ముదినేపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెదపాలపర్రు జిల్లా పరిషత్ హైస్కూలు పదవ తరగతి విద్యార్థులకు తన వితరణతో రిటైర్డ్ డీవైఈవో గన్నమనేని వెంకటేశ్వరరావు స్టడీ మెటీరియల్ అందజేశారు. శనివారం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో సుమారు 40 మంది విద్యా ర్థులకు రూ.4 వేల వ్యయంతో స్టడీ మెటీరియల్‌ను అందించారు. ప్రతీ రోజూ సాయంత్రం హైస్కూ ల్‌లో ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థుల కు స్నాక్స్ అందజేస్తానని తెలిపారు. హెచ్‌ఎం పాండురంగారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలపై అవగాహన

మండవల్లి డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఒక్క సీసీ కెమెరా పదిమంది పోలీసులతో సమానమని, అవకాశం ఉన్నవారు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సీఐ రవికుమార్ పేర్కొన్నారు. చింత పాడులో సైబర్ నేరాలు, సీసీ కెమెరాల వల్ల ఉప యోగాలపై గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

శాశ్వత పరిష్కారమే రెవెన్యూ సదస్సుల లక్ష్యం

ముదినేపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి భవిష్యత్తులో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా చూడడమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని ముదినేపల్లి తహసీల్దార్ సుభానీ అన్నారు. చిన కామనపూడి, పెదకామనపూడి గ్రామాల్లో శని వారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతులు తమ భూములకు సంబంధించిన ఏ సమస్యనైనా సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. అందుకు తాము సహకరిస్తామన్నారు. సర్పంచ్ నాంచారయ్య, వీఆర్వో, సర్వేయర్ రాజశేఖరరెడ్డి, రీ సర్వే డీటీ పాల్గొన్నారు.

మట్టగుంటలో 184 అర్జీలు

కలిదిండి : మట్టగుంటలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై 184 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. సదస్సులో వస్తున్న అర్జీల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ అంద్రాజు రత్నమణి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ దుర్గారావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఎ.శ్రీనివాస్, డీసీ మాజీ చైర్మన్ సారిక వెంకటేశ్వరరావు, డీసీ వైస్ చైర్మన్ వీరబ్రహ్మం, వీఆర్వోలు పాల్గొన్నారు.

రీసర్వేలో ప్రభుత్వ భూమిగా మార్చివేశారు

కైకలూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించిన రీసర్వేలో గ్రామానికి చెందిన 35 ఎకరాల చేపల చెరువులను ప్రభుత్వ భూమిగా గుర్తించారని రైతులు అధికారులకు మొర పెట్టుకున్నారు. రామవరంలో శనివారం గ్రామసభ జరిగింది. గ్రామానికి చెందిన 60 మంది రైతులకు చెందిన 35 ఎకరాల భూమి సీలింగ్ ల్యాండ్ ఉందని, గతంలో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిందని, ఆ భూమిని ఇప్పుడు ప్రభుత్వ భూమిగా మార్చివేశారంటూ పిర్యాదు చేశారు. ఆ భూములను గతంలో వలే రైతుల పేరిట అడంగళ్, ఆన్‌లైన్‌లో చూపించాలని, 22ఏ నుంచి తొలగించాలని తహసీల్దార్ ఇబ్రహీంకు అర్జీలు ఇచ్చారు. సర్పంచ్ మరియమ్మ, ఉప సర్పంచ్ అడవి కనకదుర్గా ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు హాజరు కాకుంటే ఎలా..?

- ముదినేపల్లి మండల పరిషత్ సమావేశంలో సభ్యుల ఆగ్రహం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా : ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ.. పాల్గొన్న సభ్యులు

ముదినేపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాలకు గైర్హాజరవుతున్న వివిధ శాఖల అధికారుల తీరు పట్ల ఎంపీటీసీలు అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన శనివారం జరిగిన మండల పరిషత్ సమావేశంలో పలు శాఖల అధికారులు, ముఖ్యంగా రెవెన్యూ శాఖ అధికారులు హాజరు కాకపోవడంపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాలకు అధికారులు హాజరు కాకపోతే ప్రజల సమస్యలపై ఎలా చర్చించాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రశ్నించారు. తరచూ హాజరు కానీ అధికారులపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేయగా, ప్రస్తుత సమావేశానికి హాజరు కాని అధికారులకు మెమోలు జారీ చేయాలని ఎంపీపీ సత్యనారాయణ ఎంపీడీవో రామకృష్ణకు తెలిపారు. కనీసం రెవెన్యూ సదస్సుల వివరాలు చెప్పడం లేదని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆరోపించడంతో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఎంపీపీ తెలిపారు. సమావేశానికి ఎంఈవో, ఐకేపీ ఏపీఎం హాజరు కాకపోవడం పట్ల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరైన అధికారులతోనే సమావేశంలో సభ్యులు చర్చించారు. వైస్ ఎంపీపీ రాచూరి రాధా సుకన్య, ఈవోపీఆర్డీ అశోక్, ఏవో వేణుమాధవ్, ఏవో రమణరావు తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

మండవల్లి డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ పాలన స్వర్ణయుగం వంటిదని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. లింగాలలో శనివారం ఆయన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరణ చేశారు. సర్పంచ్ బోయిడి ధనలక్ష్మీ, సురేష్ ఆర్థిక సహకారంతో నూతనంగా నిర్మించిన బస్సు షెల్టర్‌ను మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. కూటమి నాయకులు దుర్గాప్రసాద్, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆది వినాయక ఆలయ అభివృద్ధికి కృషి

ముదినేపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని ఆది వినాయక స్వామి ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. ఆనవాయితీ ప్రకారం ధనుర్మాసంలో నియోజకవర్గంలోని ఆలయాల సందర్శనలో భాగంగా ఆయన శనివారం ముదినేపల్లిలోని ఆది వినాయక స్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు జరిపారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ అడుసుమిల్లి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొండంగి ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడిగా కమలదాస్

కలిదిండి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొండంగి ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా తిరుమలశెట్టి కమలదాస్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఆంజనేయరాజు, కార్యదర్శి పొనమండ గోవిందరాజును ఎన్నుకున్నారు. సర్పంచ్ తిరుమలశెట్టి జ్యోతి సుబ్రహ్మణ్యం, కూటమి నాయకులు బస్వాని రాజ్ కుమార్, వైదాని రాధాకృష్ణ, తిరుమలశెట్టి నరసింహస్వామి, సత్తిరాజు కమలదాసుకు అభినందనలు తెలిపారు.

వైసీపీ అవినీతి వల్లే విద్యుత్ భారం

టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ నరసింహారావు

ముదినేపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్లల్లో వైసీపీ అవినీతి, అసమర్థ పాలన వల్లే విద్యుత్ రంగంలో ఆర్థిక సంక్షోభంలో పడిందని తెలుగుదేశం పార్టీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు విమర్శించారు. వైసీపీ నాయకులు వాస్తవాలను పక్కన పెట్టి విద్యుత్ చార్జీలను ఎన్డీయే ప్రభుత్వం పెంచుతుందంటూ ప్రజలను పక్కదోవ పట్టించేందుకు ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేస్తున్నారని శనివారం ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు.



వలసపల్లిలో మిర్చితోట వద్ద ఆందోళన చేస్తున్న రైతుసంఘం నాయకులు

మిర్చి రైతులను ప్రభుత్వం అదుకోవాలి

ముసునూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నల్లి పురుగు వల్ల తీవ్రంగా నష్టపోతున్న మిర్చి రైతులను ప్రభుత్వం తక్షణమే అదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు నిమ్మగడ్డ నరసింహా డిమాండ్ చేశారు. శనివారం వలసపల్లి, యల్లాపురం, గుడిపాడు గ్రామాల్లో మిర్చి పంటలను రైతుసంఘం నాయకులు పరిశీలించి, వలసపల్లి మిర్చి తోట వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నరసింహా మాట్లాడుతూ నూజివీడు రెవిన్యూ పరిధిలో సుమారు వెయ్యి ఎకరాల్లో మిర్చి పంట సాగవుతుందన్నారు. ఐదేళ్ళుగా మిర్చి పంటకు నల్లిపురుగు ఆశించి నష్టం చేకూర్చుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏకసభ్య కమిషన్‌కు వినతుల అందజేత

చాట్రాయి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై మచిలీపట్నంలో శనివారం విచారణ జరిపిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు మండల మాల సంక్షేమ సంఘం కోర్ కమిటీ సభ్యుడు నక్కా రాము ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ 23 శాతానికి పెంచటానికి దళితులందరూ ఒక్కతాటి మీదకు వచ్చి పోరాటం చెయ్యాలని ఉన్న రిజర్వేషన్ ముక్కలు చేస్తే ముందు తరాలకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు.

నూజివీడు టౌన్: సుప్రీంకోర్టు నిర్ణయం ప్రకారం ఎస్సీ వర్గీకరణ జరిగే విధంగా కృషిచేయాలని వర్గీకరణపై ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్‌కు ఎమ్మార్పీఎస్ నాయకులు వినతిపత్రాన్ని అందించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు తొమ్మండ్రు రుద్రయ్య, యంత్రపాటి వేణు, ములుగుమాటి రమేష్, ఆముదాల చిరంజీవి, కారుమంచి రాజు తదితరులు వినతిపత్రాన్ని అందించారు.

ఆయా సీతామహాలక్ష్మికి సన్మానం

చాట్రాయి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): చీపురుగూడెం శివారు మంగపేట అంగన్వాడీ కేంద్రంలో సుదీర్ఘ కాలం ఆయాగా పనిచేసి రిటైర్డు అయిన పి. సీతామహాలక్ష్మిని టీడీపీ నాయకులు మందలపు జగదీష్, గంటసాల మన్మధరావు,ఐసీడీఎస్ అంగన్వాడీ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

అధికారుల తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం



మాట్లాడుతున్న కౌన్సిలర్లు (ఇన్‌సెట్‌లో) చైర్‌పర్సన్ త్రివేణి దుర్గ

నూజివీడు టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మునిసిపల్ సమావేశంలో అధికారుల తీరుపై అధికార వైసీపీ కౌన్సిలర్లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం మునిసిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ త్రివేణి దుర్గ అధ్యక్షతన నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. నూజివీడు మునిసిపాలిటీలో బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదన రాగా దీనిపై పురపాలక అధికారులు స్పందిస్తూ, జిల్లా కలెక్టర్, ఎస్పీ,ఇతరశాఖల అనుమతులు కావాలంటూ పేర్కొనడంతో అధికార వైసీపీ కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీలో ఫుడ్‌కోర్టు, ఇతర షాపుల ఏర్పాటుపై త్రీమెన్‌కమిటీ సూచనల ప్రకారం సదరు షాపులను మెప్మాకు ఇవ్వాల్సి ఉందని, అయితే వాటిని మెప్మా పేరుతో థర్డ్‌పార్టీ షాపులను ఎలా నడుపు తున్నారంటూ నూజివీడు మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, మెప్మా అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీ మురుగునీటిని ట్రిపుల్‌ఐటీ నుంచి దాదాపు 5.కిమీ దూరంలో పారబోయాల్సి ఉండగా, ట్రిపుల్‌ఐటీ పరిసర ప్రాంతాల్లోని చేలల్లోనే మురుగు నీటిని వదులుతున్నారని, ఫలితంగా మురుగు నీరు తీతురువాగు ద్వారా పెద్దచెరువు చేరుతోందంటూ మున్సిపల్ కౌన్సిలర్ కొమ్మని విజయ మున్సిపల్ కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు.

110 అర్జీల పరిష్కారం: సబ్ కలెక్టర్



వినతులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఆగిరిపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ బి. స్మరణ్‌రాజ్ అన్నారు. శనివారం ఆగిరిపల్లి సచివాలయంలో తహసీల్దార్ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలో 160 అర్జీలు వచ్చాయన్నారు. వాటిలో ఇప్పటివరకు 110 సమస్యలను పరిష్కరించామన్నారు. ఈ సదస్సులో 16 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ ప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చౌటపల్లి లక్ష్మి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మరియన్న, సర్వేయర్ గంగరాజు పాల్గొన్నారు.

చాట్రాయిలో ఐదు అర్జీల స్వీకరణ

చాట్రాయి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): చాట్రాయి సచివాలయంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ప్రశాంతి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. 5 అర్జీలు వచ్చినట్లు అధికారులు చెప్పారు. కార్యక్రమంలో సర్వేయర్ లక్ష్మీనారాయణ, వీఆర్వో సత్యనారాయణ, జనసేన నాయకుడు తమ్మల జగన్, బీజేపీ నాయకుడు ఆదిమూలం శర్మ తదితరులు పాల్గొన్నారు.

గోపవరంలో 12 అర్జీలు స్వీకరణ

ముసునూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గోపవరంలో జరిగిన గ్రామసభలో భూ సమస్యలపై రైతుల నుంచి వచ్చిన అర్జీలను ఇన్‌చార్జి తహసీల్దార్ జి.పురుషోత్తమశర్మ స్వీకరించారు. ఈ గ్రామసభలో 12 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 14 రెవిన్యూ గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో భూ సమస్యలపై 289 అర్జీలు వచ్చాయన్నారు. సోమవారం బలివేలో జరిగే గ్రామసభతో మండలంలో రెవెన్యూ గ్రామసభలు ముగుస్తాయని శర్మ తెలిపారు.

సాగుదారులకు పట్టాలివ్వకపోతే ఆందోళన

చాట్రాయి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆరుగొలనుపేట ఫారెస్ట్‌లో చిత్తపూరుకు చెందిన సుమారు 300 మంది పేదలు 70 ఏళ్ళ నుంచి సాగు చేసుకుంటున్న భూముల విషయంలో 15 రోజుల్లో సానుకూల నిర్ణయం తీసుకోకపోతే నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద 24 గంటల మహాధర్నా చేపడతామని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరనాథ్ హెచ్చరించారు. మండలంలోని చిత్తపూరు దళితవాడలో శనివారం జరిగిన సాగుదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాగుదారులకు తెలియకుండా ఫారెస్ట్ అధికారులు ఫోర్ నోటిఫికేషన్ జారీ చేయటం అన్యాయమన్నారు. సాగుదారులు ఫారెస్ట్ సెటిల్‌మెంట్ కార్యాలయంలో క్లైమ్‌లు దాఖలు చేసి ఏళ్ళు గడుస్తున్నా విచారణ చేపట్టలేదని అన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న సమగ్రశిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ పంకజ్ కుమార్

మధ్యాహ్న భోజనం పరిశీలన

నూజివీడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నూజివీడు బాలికోన్నత పాఠశాలను ఏలూరు జిల్లా సమగ్రశిక్షా ప్రాజెక్టు కోఆర్డినేటర్ పంకజ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించి ఏజన్సీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో నిలిచిన భవన నిర్మాణాలపై స్పందిస్తూ సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపడం జరుగుతోందన్నారు. అనుమతులు వచ్చిన అనంతరం నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో సేవియ్యానాయక్, ఎంఈవో జమలయ్య, పీఆర్పీలు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రాప్ ఇన్సూరెన్స్ చేయండి

నూజివీడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):రైతులు వ్యవసాయ పంటలకు అందిస్తున్న క్రాప్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు విద్యాసాగర్ కోరారు. నూజివీడు వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ క్రాప్ ఇన్సూరెన్స్‌వల్ల రైతులకు బీమా ఏర్పడుతుందన్నారు. మినుము, పెసలు, మొక్కజొన్న, వరి, తదితర పంటలకు బీమా ప్రీమియంను ఈనెల 31లోపు చెల్లించాలని, ఇతర వివరాలకు మండల వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు.